సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 30.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 188
పేజీలు: 12 వెల: రూ. 5

## పసుపు జెండా పౌరుషం
# ఎప్పుడూ తగ్గలే
### టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకారంలో సీఎం చంద్రబాబు

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేష్ ప్రమాణం
- బలమైన క్యాడర్‌తో టీడీపీకి కొత్త ఉత్సాహం
- వచ్చే ఎన్నికల్లో మరింత ఓట్ల లక్ష్యం
- వైకాపా పాలనపై లోకేశ్ విమర్శలు..కార్యకర్తలకే కీర్తి
- అభివృద్ధి అజెండాతో ముందుకు టీడీపీ, క్షేత్రస్థాయిలో దృష్టి

10






## బెంగాల్‌లో హోరాహోరీ..
# తమిళనాట డీఎంకే!
### ఐదు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్‌తో దేశ రాజకీయాల్లో ఉత్కంఠ
### బెంగాల్‌లో బీజేపీ, టీఎంసీ మధ్య గట్టి పోటీ

- తమిళనాడులో మరోసారి డీఎంకేకు అధికారం సూచనలు
- కేరళలో అధికార మార్పునకు ప్రజల తీర్పు సంకేతం
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ దిశగా ముందంజ
- పుదుచ్చేరిలో ఎన్డీఏ మళ్లీ గెలుపు దిశగా
- మహిళలు, యువత ఓట్ల ప్రభావం స్పష్టంగా బయటపడిన సర్వేలు
- ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం ఇంకా కొనసాగుతోందని అంచనాలు
- మే 4 కౌంటింగ్‌పై దేశవ్యాప్తంగా ఆసక్తి
- జాతీయ రాజకీయాలకు దిశానిర్దేశం చేసే ఎన్నికల ఫలితాలు

**ముద్ర డెస్క్:**
దేశ రాజకీయాలను కుదిపేస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు సంచలనంగా మారాయి. కౌంటింగ్ మే 4న జరగనున్న నేపథ్యంలో, వివిధ సర్వే సంస్థలు విడుదల చేసిన అంచనాలు జాతీయ స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా చాణక్య స్ట్రాటజీస్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారం దిశగా సాగుతుండగా, తమిళనాడులో డీఎంకే మరోసారి పగ్గాలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**పశ్చిమ బెంగాల్‌లో హోరాహోరీ బీజేపీకి ఆధిక్యం**

294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 150–160 స్థానాలు గెలిచి మెజార్టీ సాధించే అవకాశముందని చాణక్య స్ట్రాటజీస్ అంచనా వేసింది.ఇక మరికొన్ని సర్వే సంస్థలు బెంగాల్ లో మమతా బెనర్జీ గెలుస్తుందని తీర్పునిచ్చాయి. తృణమూల్ కాంగ్రెస్: 177–187, భాజపా: 95–110. గెలుస్తుందని చెప్పాయి. దీంతో బెంగాల్‌పై గందరగోళం నెలకొంది. మమతా బెనర్జీ వరుస విజయాలకు బ్రేక్ పడుతుందా? లేక తిరిగి గెలిచి చరిత్ర సృష్టిస్తుందా అన్నది ఉత్కంఠగా మారింది.
పశ్చిమ బెంగాల్ లో హోరాహోరీ పోరు ఉంటుందని బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంటుందని చాణక్య స్ట్రాటజీస్ సర్వే అంచనా వేసింది. అయితే మరికొన్ని సర్వేలు బెంగాల్ లో మమత గెలుస్తుందని సర్వేలో చెప్పాయి. 294 స్థానాలకుగాను బీజేపీ 150–160, టీఎంసీ 130–140, ఐఎన్‌సీ–2–4, ఇతర పార్టీలు 4–6 సీట్లలో విజయం సాధిస్తాయని మిగతా 02లో

## నాక్కొంచెం తిక్కుంది..
# దానికో లెక్కుంది

- ఇరాన్‌పై ట్రంప్ 'మాస్' వార్నింగ్.. కఠిన వైఖరి సంకేతాలు
- "ఇక మంచోడిగా ఉండను" అంటూ సంచలన వ్యాఖ్యలు
- రైఫిల్ ఫొటోతో ట్రంప్ సందేశం.. పశ్చిమాసియాపై ప్రపంచ దృష్టి
- అమెరికా హెచ్చరికతో టెన్షన్ పెరుగుతోంది

10




## స్వాధీనం చేసుకున్న
# మెట్రో రైల్
### ఎల్ అండ్ టీతో ఒప్పందం



- రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ
- మెరుగ్గా మెట్రో విస్తరణ పనులు, ప్లాన్, సేవలు

10

## ఇదెక్కడి కథ

- కత్తేమో వానికిచ్చి యుద్ధం నన్ను చేయమంటున్నవ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

09



# ములుగు ఫస్ట్..
## హైదరాబాద్ లాస్ట్!
### టెన్త్ ఫలితాల్లో రాష్ట్రానికి 95.15% పాస్ రేట్..



- బాలికలు మరోసారి ముందంజ
- 5.26 లక్షల మంది పరీక్షలు రాయగా 4.97 లక్షల మంది విజయవంతం
- రీకౌంటింగ్‌కు ఏప్రిల్ 30 నుంచి అవకాశం..
- జూన్‌లో సప్లిమెంటరీ పరీక్షలు
- ప్రభుత్వ, మోడల్, రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన ఫలితాలు..
- కొన్ని ప్రైవేటు స్కూళ్లలో నిరాశ

**ముద్ర, డెస్క్ :**
తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్ష ఫలితాల్లో 95.15శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా 5,26,166 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. 4,97,312మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 96.26 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. బాలుర ఉత్తీర్ణత శాతం 94.07గా ఉన్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా వెల్లడించారు. 30 నుంచి మే 15వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తుకు అవకాశం. జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఈ నెల 30 నుంచి మే 14వరకు ఫీజు చెల్లించవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 5,713 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా.. ఆరు ప్రైవేటు స్కూల్స్‌లో మాత్రం సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైంది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.23శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 89.23శాతం ఉత్తీర్ణత రికార్డయింది. అలాగే, సామాజిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రభుత్వ పాఠశాలల్లో 86.18శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 93.53శాతం, మోడల్ స్కూల్స్‌లో 97.83శాతం, కేజీబీవీల్లో 98 శాతం, ప్రైవేటు స్కూల్స్‌లో 95.81శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదైంది.

## ఉద్యోగులకు 'సర్కార్'
# భరోసా
### డిప్యూటీ సీఎం ఆదేశాలు

- ₹1000 కోట్ల బకాయిల విడుదల చేసిన సందీప్ కుమార్ సుల్తానియా
- నెలకు ₹700 కోట్ల నుండి ₹1000 కోట్లకు పెరిగిన చెల్లింపులు
- అక్టోబర్ 2025 వరకు రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ క్లియర్
- ఎప్పటికప్పుడు ఉద్యోగుల మెడికల్ బిల్లులను క్లియర్ చేస్తున్న ప్రభుత్వం

03



## పార్టీ పెట్టే డబ్బులు కవితకు ఎక్కడివి?
### కేసీఆర్ కుటుంబం ముందు ఆస్తి తగాదాలు పరిష్కరించుకోవాలి


03



- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి

-ముద్ర, కరీంనగర్

**ముద్ర, హైదరాబాద్ :**
గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో పదోన్నతులు ఇవ్వనున్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ పోస్టులపై జీపీవోలకు కూడా లైన్ క్లియర్ అయింది. జిల్లా స్థాయిలో పదోన్నతులకు రొటేషన్ విధానం అమలులో ఉంటుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ మరోసారి ఇవ్వాలని నిర్ణయం అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ మరోసారి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే 1 నుంచి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.'



**వరంగల్ పరిధిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్ సస్పెన్షన్**
వరంగల్ పరిధిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వడ్డీ డబ్బులు ఇవ్వట్లేదని దాడి చేసిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, మద్యం తాగి విధులకు హాజరైన హసన్‌పర్తి హెడ్ కానిస్టేబుల్ రాములు, మిగతా 02లో

## పదోన్నతులకు
# పచ్చజెండా
### గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- ప్లాట్ల క్రమబద్ధీకరణకు మళ్లీ 25% రాయితీ అమలు
- వరంగల్‌లో ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ చర్యలు
- ఇంధన కొరత ప్రచారంపై కేంద్రం క్లారిటీ
- కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

ఇదీ AI ముద్ర



**రోజూ వ్యాయామం తప్పనిసరి**



రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా జాగింగ్ చేయాలి.ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది, బరువు నియంత్రణలో ఉంచుతుంది.

# బెంగాల్‌లో హోరాహోరీ.. తమిళనాటలో డీఎంకే!




(మొదటి పేజీ తరువాయి)
పేర్కొంది. ఇక తమిళనాట మరోసారి డీఎంకే అధికారం చేజిక్కించుకుంటుందని తెలిపింది. 234 స్థానాలకుగాను కూటమి 145-160 సీట్లు, ఏఐ డీఎంకే 50-65, టీవీకే 13-18, ఇతర పార్టీలు 5-8 సీట్లు గెలుస్తాయని వెల్లడించింది.

**విడుదలైన ఎగ్జిట్ పోల్స్**

తమిళనాడు (234): డీఎంకే 125-146,ఏడీఏఎంకే 65-80, టీవీకే 18-24, ఇతరులు 2-6, కేరళం (140): ఎల్‌డీఎఫ్ 55-65, యూడీఎఫ్ 75-85, ఎన్‌డీఏ 0-3
అసోం (126): బీజేపీ 68-72, కాంగ్రెస్ 22-26,ఏజీపీ 7-10, బీపీఎఫ్ 8-9 కేరళలో యూడీఎఫ్ సర్కార్ అని అంచనా వేసిన పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ కేరళలో అధికార మార్పు సంప్రదాయానికే మళ్లీ రాష్ట్ర ప్రజలు ఓటేశారని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో తేలింది. కేరళలో వరుసగా 2016, 2021లో అధికారంలోకి వచ్చిన వామపక్షాల ఎల్‌డీఎఫ్ కూటమికి ఈ సారి భంగపాటు తప్పదని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి పీఠం ఖాయమని సర్వేలో వెల్లడైంది. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో మెజార్టీకి 71 సీట్లలో గెలవాలి. కేరళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ 75-85, ఎల్‌డీఎఫ్ 55-65, ఎన్డీఏ 0-3 స్థానాల్లో గెలిచే అవకాశాలున్నాయని సర్వేలో తేలింది. యూడీఎఫ్ కూటమి ఎల్‌డీఎఫ్ కంటే 2 శాతం ఆధిక్యత కనబరుస్తుందని సర్వేలో వెల్లడైంది. ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం పనితీరుపై సర్వేలో 55.1 శాతం సంతృప్తి వ్యక్తం చేసినా ఎల్‌డీఎఫ్‌కు మళ్లీ అధికారం కట్టబెట్టకపోవడం ఇక్కడ విశేషం. ఎల్‌డీఎఫ్‌కు మరోసారి అవకాశం ఇవ్వమని 42 శాతం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పినయర్ విజయన్‌కు 22.3 శాతం మద్దతివ్వగా, కాంగ్రెస్ నేత సతీషన్‌కు 14.5 శాతం మద్దతిచ్చారు. ఎన్నికల్లో పార్టీకి ప్రాధన్యతిచ్చామని 51.8 శాతం చెప్పగా, 33.1 శాతం మంది అభ్యర్థులను బట్టి ఓటు వేశామని చెప్పారు. కేరళలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభావం నామమాత్రంగానే కనిపించింది. రాష్ట్రంలో ఎన్డీఏ మూడో ప్రత్యామ్నాయంగా ఎదగలేదని సర్వేలో వెల్లడైంది. 59.4 శాతం మంది రాష్ట్రంలో మూడు ఫ్రంట్ అవసరం లేదని సర్వేలో చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై 50.9 శాతం అసంతృప్తి వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ప్రచారంపై కేరళలో ఆసక్తి కనిపించలేదు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటముల మధ్య ముఖాముఖి పోటీ జరిగిన కేరళలో పదేళ్ల వామపక్ష ప్రభుత్వానికి ప్రజలు బ్రేకులు వేసినట్టు పీపుల్స్ పల్స్ సర్వేలో తేలింది.

**అస్సాంలో హ్యాట్రిక్ దిశగా బీజేపీ**

అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని నార్త్ ఈస్ట్ డెమొక్రాటిక్ అలెయెన్స్ (ఎన్ఈడీఏ) వరుసగా మూడోసారి అధికారంలోకి రానుందని పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడైంది. ఎన్డీఏ కూటమి ఇక్కడ ఎన్ఈడీఏగా పిలువబడుతుంది. అస్సాంలో 126 అసెంబ్లీ స్థానాలుండగా మెజార్టీకి 64 స్థానాలు కావాలి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 68-72 స్థానాలు, కాంగ్రెస్ పార్టీకి 22-26 స్థానాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని సర్వేలో వెల్లడైంది. ఎన్ఈడీఏ కూటమిలో బీజేపీ మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఏజీపీ) 7-10, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) 8-9 స్థానాల్లో గెలిచే అవకాశాలుండడంతో ఎన్డీఏ కూటమి 90 స్థానాలకు చేరుకోవచ్చు. బీజేపీ 38.6 శాతం, కాంగ్రెస్ 36.5 శాతం ఓట్లు పొందే అవకాశాలున్నాయని సర్వేలో తేలింది. అస్సాం ఎన్నికల్లో ఇతర పార్టీలైన ఏఐయూడీఎఫ్, రాయిజర్ దాల్, యూపీపీఎల్, ఏజేపీ, సీపీఐ(ఎం), ఇతరుల ప్రభావం నామమాత్రంగానే కనిపిస్తోంది. బీజేపీ ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ నాయకత్వానికి 45 శాతం మద్దతిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగాయ్‌కు 35 శాతం మద్దతిస్తున్నారు. అప్పర్ అస్సాంలో ఎన్డీఏ పటిష్టంగా ఉంది. మధ్య అస్సాంలోని నాగావ్, హూజాయ్, కర్బి అంగలాంగ్, దిమా హసావ్, దారంగ్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ కనిపించింది. ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న లోయర్ అస్సాంలో ఏఐయూడీఎఫ్ గతంలో పోలిస్తే కొంత బలోపేతమయినా ఇక్కడ ఎన్డీఏ ఆధిపత్యం కనిపిస్తోంది.

**తమిళనాడులో మరోసారి డీఎంకే**

తమిళనాడు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమి మరోసారి అధికారం చేపట్టనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడైంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 84 శాతంపైగా ఓటింగ్ నమోదయ్యింది. గత 2021 ఎన్నికల కంటే 11 శాతం ఎక్కువగా ఓటింగ్ నమోదయ్యింది.తమిళనాడు చరిత్రను పరిశీలిస్తే గత నాలుగు దశాబ్దాల్లో రాష్ట్రంలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారే సంప్రదాయం ఉంది. అయితే 2016లో మాత్రం జయలలిత నేతృత్వంలో ఏఐడీఎంకే వరుసగా రెండోసారి అధికారం చేపట్టారు. ఇప్పుడు డీఎంకే రెండో సారి అధికారం చేపట్టే అవకాశాలున్నట్టు సర్వేలో తేలింది. అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐడీఎంకే కూటముల మధ్య తీవ్ర పోటీ ఉన్నా డీఎంకే ఆధిపత్యం కనిపిస్తోందని సర్వేలో తేలింది. సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ రెండు కూటములకు గట్టి పోటీ ఇస్తుందని సర్వేలో వెల్లడైంది. తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలుండగా మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. డీఎంకే కూటమి 125-145 స్థానాలతో అధికారం చేపట్టనుందని సర్వేలో తేలింది. ఏఐడీఎంకే 65-80 స్థానాలతో మరోసారి ప్రతిపక్షానికే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. టీవీకే 18-24 స్థానాలు, ఇతరులు 2-6 స్థానాలు గెలుపొందే అవకాశాలున్నాయి. డీఎంకే కూటమి 38.4 శాతం, ఏఐడీఎంకే 31.5 శాతం, టీవీకే 23.6 శాతం, ఇతరులు 6.5 శాతం ఓట్లు పొందే అవకాశాలున్నాయి. ఎన్నికల సర్వేలో 3 శాతం ప్లస్ ఆర్ మైనస్ ఉండే అవకాశం ఉంది. మహిళలు డీఎంకేకు 37.8 శాతం, ఏఐడీఎంకేకు 30.2 శాతం, టీవీకేకు 26 శాతం, ఇతరులకు 6 శాతం మద్దతివ్వగా, పురుషులు డీఎంకేకు 39.5 శాతం, ఏఐడీఎంకేకు 32.6 శాతం, టీవీకేకు 21.1 శాతం, ఇతరులకు 6.8 శాతం మద్దతిచ్చారు. 18 నుండి 24 ఏళ్ల మధ్య నూతన యువ ఓటర్లలో డీఎంకేకు 34.9 శాతం, ఏఐడీఎంకు 25.8 శాతం, టీవీకేకు 32.3 శాతం, ఇతరులకు 7 శాతం మద్దతిచ్చినట్టు సర్వేలో తేలింది. సినీ నటుడు విజయ్ యువ ఓటర్లపై భారీ ఆశలు పెట్టుకున్నా అధికార డీఎంకే వైపు యువత మొగ్గు చూపినట్టు సర్వేలో వెల్లడైంది. డీఎంకే, ఏఐడీఎంకే ప్రత్యక్షంగా పోటీ పడకుండా వారి మిత్రపక్షాలు పోటీ పడిన స్థానాల్లో టీవీకే గట్టి పోటీ ఇచ్చిందని సర్వేలో తేలింది. ప్రధాన అభ్యర్థుల స్థానాలను పరిశీలిస్తే డీఎంకే అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ కొలతూరులో, ఏఐడీఎంకే అధినేత మాజీ ముఖ్యమంత్రి పళని స్వామి ఎడప్పాడిలో విజయం దిశగా కొనసాగుతున్నారు. మరో ఏఐడీఎంకే మాజీ సీఎం పన్నీరు సెల్వం ఎన్నికల ముందు డీఎంకేలో చేరి బోడినాయకనూర్ నుండి పోటీ చేస్తుండగా అక్కడ టీవీకే నుండి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. సినీ నటుడు టీవీకే అధినేత విజయ్ రెండు స్థానాల్లో పోటీ చేస్తుండగా పెరంబూర్ నుండి గెలిచే అవకాశాలుండగా, ఈస్ట్ తిరుచిరాపల్లిలో వెనకబడినట్టు సర్వేలో తేలింది. డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చపాక్ నుండి పోటీ పడుతుండగా ఆయన అక్కడ టీవీకే పార్టీ నుండి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. శ్రీపెరంబదూర్ నుండి పోటీలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సెల్వ అక్కడ టీవీకే చేతిలో వెనుకబడినట్టు సర్వేలో తేలింది.
తెలంగాణ మాజీ గవర్నర్ తమిళ సై మైలాపూర్‌లో బీజేపీ తరపున పోటీ పడుతుండగా ఆమె టీవీకే చేతిలో ఓడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమిళనాడు బీజేపీ చీఫ్ నయనార్ నాగేందర్ పోటీ పడుతున్న సత్తూరులో ఆయన గెలిచే అవకాశాలున్నట్టు సర్వేలో తేలింది. సినీ నటుడు దివంగత విజయ్‌కాంత్ సతీమణి, డీఎండీకే చీఫ్ ప్రేమలత గతంలో విజయ్‌కాంత్ గెలిచిన విరుదాచలం నుంచి పోటీ పడుతుండగా ఆమె మూడో స్థానానికే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. తమిళ రాజకీయాల్లో వృద్ధ నేత. కరుణానిధి సన్నితులైన 86 ఏళ్ల దురై మురుగన్ డీఎంకే తరఫున కాట్పడి నుండి పోటీ పడుతుండగా ఆయన ఇప్పుడు పదకొండవ సారి గెలిచే అవకాశాలున్నాయి. ఏఐడీఎంకే మిత్రపక్షం పీఎంకే చీఫ్ అన్బమణి రాందాస్ సతీమణి సౌమ్య అన్బమణి రాందాస్ ధర్మపురి నుండి పోటీ చేస్తుండగా ఆమె టీవీకే నుండి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. డీఎంకే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు టీవీకే, ఏఐడీఎంకే మధ్య చీలిపోతున్నాయి. టీవీకే, పీఎమ్‌కే (ఆర్), శశికళ కూటమితో ఏఐడీఎంకే నష్టపోతోంది. ముఖ్యంగా ఏఐడీఎంకే ట్రెడిషనల్ ఓటు బ్యాంకు అయిన తేవర్ శశికళ కూటమి, ఓపీఎస్ వల్ల, వన్నియార్ ఓటు పీఎమ్‌కే (ఆర్) పార్టీ వల్ల నష్టపోతుంది. తద్వారా గ్రాస్ రూట్‌లో ఏఐడీఎంకే చాలా స్థానాల్లో దెబ్బతింది. ఎస్సీ యూత్ టీవీకే ఆకర్షించగా, వీసీకే మద్దతుతో డీఎమ్‌కే తన ఎస్సీ ఓటు బ్యాంకు పదిలపరుకుంటుంది. విజయ్ వల్ల డీఎంకే కొంత క్రిస్టియన్ ఓట్లు కోల్పోతున్నప్పటికీ, ముస్లింలు డీఎంకే వైపే మొగ్గు చూపారు. డీఎంకే ప్రభుత్వ పథకాలతో మహిళలు ఆ కూటమి వైపు మొగ్గు చూపారు.


**పుదిచ్చేరిలో మళ్లీ ఏన్‌డీఏనే**

కేంద్ర పాలిత ప్రాంతం పుదిచ్చేరిలో ముఖ్యమంత్రి రంగస్వామి నేతృత్వంలో ఎన్డీఏ కూటమి మరోసారి అధికారం చేపట్టనుందని పీపుల్స్ పల్స్ సర్వేలో వెల్లడైంది. పుదుచ్చేరిలో 30 స్థానాలుండగా మెజార్టీకి 17 స్థానాలు కావాలి. మరో మూడు నామినేటెడ్ స్థానాలున్నాయి. పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి 16-19 స్థానాలు, సెక్యూలర్ ప్రొగ్రెసివ్ (ఎస్‌పీఏ) కూటమి 10-12 స్థానాలు, ఇతరులు 1-2 స్థానాలు గెలిచే అవకాశాలున్నట్లు సర్వేలో తెలింది. 2026అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ 34 నుండి 36 శాతం, ఎస్‌పీఏ కూటమి 30 నుండి 32 శాతం, టీవీకే, ఎన్ఎమ్‌కే కూటమి 15 నుండి 17 శాతం, ఎన్‌టీకే 4 నుండి 6 శాతం, వీసీకే 1 నుండి 3 శాతం, ఇతరులు 2 నుండి 5 శాతం ఓట్లు పొందే అవకాశాలున్నట్లు సర్వేలో వెల్లడైంది. ఎన్డీఏ కూటమిలోని ఏఐఎన్ఆర్‌సి పార్టీ 10-12 సీట్లతో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా నిలవనుంది. ఎన్డీఏలోని బీజేపీ 5-6 స్థానాలు, ఎల్‌జేకే 1-2, ఏఐఏడీఎమ్‌కే 0-1 స్థానాలు గెలవొచ్చు. ఎస్‌పీఏ కూటమిలోని డీఎమ్‌కే 6-8, కాంగ్రెస్ 1-3 స్థానాలు, టీవీకే, ఇతరులు 1-2 స్థానాలు గెలిచే అవకాశాలున్నాయని సర్వేలో తేలింది. పుదుచ్చేరిలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలు ఆ కూటమి విజయానికి దోహదం చేస్తున్నాయి. పుదిచ్చేరిలో దాదాపు 68 శాతం మంది ముఖ్యమంత్రిగా ఎన్.రామస్వామికి మద్దతిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి మరోసారి అవకాశమిస్తామని దాదాపు 60 శాతం చెప్పగా, 36 శాతం మరోసారి అవకాశమివ్వమని చెప్పారు. పుదిచ్చేరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అవసరమని దాదాపు 65 శాతం మంది అభిప్రాయపడ్డారు. పుదిచ్చేరిలో అభివృద్ధికి సంబంధించి 56 శాతం మంది ఏఐఎనఆర్‌సికి మద్దతివ్వగా, 24 శాతం మంది కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు.

**దేశ రాజకీయాలకు కీలక ఎన్నికలు**

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు జాతీయ రాజకీయాలకు దిశానిర్దేశం చేయనున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలతో పాటు టీఎంసీ, డీఎంకే, లెఫ్ట్ పార్టీల భవిష్యత్తు కూడా ఈ ఫలితాలపై ఆధారపడి ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, కులగణన, ప్రాంతీయ-జాతీయ నినాదాలు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మారాయి.
మొత్తం చూస్తే..
ఎగ్జిట్ పోల్స్ ప్రకారం దేశవ్యాప్తంగా ఎన్డీఏ బలంగా కనిపిస్తున్నప్పటికీ, రాష్ట్రాలవారీగా విభిన్న ఫలితాల సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
బెంగాల్‌లో బీజేపీ-టీఎంసీ తలపడి పోటీ
తమిళనాడులో డీఎంకే ఆధిపత్యం
కేరళలో అధికార మార్పు
అసోం, పుదుచ్చేరిలో ఎన్డీఏ బలం
ఇప్పుడు అందరి దృష్టి మే 4 కౌంటింగ్‌పైనే!

# పదోన్నతులకు పచ్చజెండా



(మొదటి పేజీ తరువాయి)
ఉన్నతాధికారి ఆదేశాలు పాటించలేదని చెన్నారావుపేట కానిస్టేబుల్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలు జారీచేశారు.

**ఇంధనం కొరత ఉందనే ప్రచారంలో వాస్తవం లేదు: కిషన్‌రెడ్డి**

రాష్ట్రంలో ఇంధనం కొరత ఉందనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. మొదట ఏపీలో సమస్య ఉత్పన్నమైతే ప్రభుత్వం రంగంలోకి దిగిందని, అక్కడి నుంచి వాహనదారుల రాకతో ఖమ్మం, కొత్తగూడెంలో కొరత మొదలైందని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, విపక్షాల దుష్ప్రచారం వల్లే ప్రజల్లో ఆందోళన పెరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

**బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రామచందర్‌రావు భేటీ**

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రామచందర్‌రావు భేటీ అయ్యారు. ఈ భేటీకి హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లు, జన సమీకరణ, సభ విజయవంతంపై చర్చించారు. జిల్లాలు, నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ చేయాలని దిశానిర్దేశం చేశారు. మే 10న బెంగళూరు నుంచి సా.4 గం.కు ప్రధాని హైదరాబాద్ రానున్నారు. సుమారు 2 గంటలపాటు మోదీ పర్యటన ఉంటుంది.

**విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ.వెయ్యి కోట్లు విడుదల**

విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో గతేడాది అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను క్లియర్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో గతవారం జరిగిన కేబినెట్ భేటీలో బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు.

**మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు**

మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన అంత్యపుష్కరాల పోస్టర్, టీజర్‌ను మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు విడుదల చేశారు. పుష్కరాలకు రూ.30 కోట్లతో 162 అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# కవిత నాలుగో శక్తిగా ఎదుగుతారా?

## కొత్త పార్టీకి తెలంగాణ రాజకీయాల్లో స్పేస్ ఉందా?

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు తిరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీ స్థాపనకు సిద్ధమవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్య పోటీ నడుస్తున్న వేళ, కవిత కొత్త పార్టీతో రంగప్రవేశం చేయడం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.
ప్రస్తుతం తెలంగాణలో త్రిముఖ పోటీ కొనసాగుతోంది.అధికారాన్ని కోల్పోయినప్పటికీ బలమైన కేడర్‌తో ఉన్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్న కాంగ్రెస్, క్రమంగా బలపడుతున్న బీజేపీ మధ్య రాజకీయ పోటీ తీవ్రంగా సాగుతోంది. ఇలాంటి సమయంలో కొత్త పార్టీ ప్రకటించడం కవిత తీసుకున్న సాహసోపేత నిర్ణయంగా కనిపిస్తోంది. అయితే తెలంగాణలో ప్రాంతీయ భావోద్వేగాలు, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో గొంతు లేని వర్గాలు, అసంతృప్త నేతలు, ముఖ్యంగా మహిళలు, బీసీ సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకుంటే కవిత పార్టీకి ఒక స్థిరమైన ఓటు బ్యాంకు ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.
ఈ పరిణామం ఎక్కువగా ప్రభావితం చేయబోయే పార్టీ బీఆర్ఎస్‌నే అని చెప్పవచ్చు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న నేతలు లేదా పార్టీలో ప్రాధాన్యం దక్కని ద్వితీయ శ్రేణి నాయకులు కవిత వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణ పేరుతో పార్టీ ఏర్పాటు చేస్తే, బీఆర్ఎస్‌కు చెందిన ఓటు బ్యాంకులో చీలిక వచ్చే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అది పరోక్షంగా కాంగ్రెస్, బీజేపీలకు లాభంగా మారే అవకాశమూ ఉంది.

- కవిత ప్రభావం ఎంత ఉంటుంది?
- కవిత కొత్త పార్టీతో మారనున్న సమీకరణాలు
- సొంత గూటికే సెగ.. బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై కవిత గురి?
- బీసీ మంత్రం.. మహిళా అస్త్రం
- కవిత పార్టీ ప్రధాన అజెండా ఇదేనా?
- తెలంగాణ సెంటిమెంట్ 2.0
- మళ్ళీ పురుడుపోసుకోనున్న ప్రాంతీయ ఆకాంక్షలు
- కింగ్ మేకర్ వైపు అడుగులు
- హంగ్ వస్తే కవిత పాత్రే కీలకం కానుందా?

కవిత తాజా వ్యాఖ్యల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించడం గమనార్హం. తెలంగాణలో జనాభా పరంగా బీసీలు పెద్ద శాతం ఉన్న నేపథ్యంలో, వారి ఆకాంక్షలను రాజకీయంగా ప్రతిబింబించే ప్రయత్నం చేస్తే ఆమెకు బలమైన సామాజిక ఆధారం ఏర్పడవచ్చు. ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీ కూడా బీసీ కార్డును వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోటీలో కవిత ఎంతవరకు ప్రజల విశ్వాసం గెలుచుకుంటారనేది కీలకం. ఇంకా ఒక ముఖ్య అంశం.. తెలంగాణ సెంటిమెంట్. తెలంగాణ జాగృతి ద్వారా దశాబ్దకాలంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవితకు క్షేత్రస్థాయిలో ఒక నెట్‌వర్క్ ఉంది. ఉద్యమంలో పనిచేసిన కార్యకర్తలు, ప్రస్తుతం రాజకీయంగా అవకాశాలు లేని నాయకులు ఆమె వెంట నడిచే అవకాశం ఉంది. ఒక వేళ ఆమె పార్టీ 10 నుంచి 15 శాతం ఓట్లు సాధించగలిగితే, భవిష్యత్‌లో ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించే 'కింగ్‌మేకర్'గా ఎదిగే అవకాశమూ ఉంది.
త్వరలో జరగబోయే ఆవిర్భావ సభలో పార్టీ పేరు, జెండా, గుర్తు, అజెండాపై పూర్తి స్పష్టత రానుంది. మొత్తం మీద తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు త్రిముఖ పోటీ నుంచి చతుర్ముఖ పోటీ వైపు మళ్లుతున్నాయి. ఈ మార్పు ఓటర్ల మనోభావాలను ఎలా ప్రభావితం చేస్తుందో, మహిళా నాయకత్వంలో వస్తున్న ఈ కొత్త ప్రాంతీయ పార్టీ ఎంతవరకు విజయవంతమవుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది.






# సమాజంలో జైళ్లశాఖ పాత్ర కీలకం

## డీజీపీ శివధర్‌రెడ్డి

**ముద్ర డెస్క్ :**
సమాజంలో జైళ్లశాఖ పాత్ర అత్యంత కీలకమని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. చంచల్‌గూడ జైళ్ల శిక్షణా సంస్థలో ఢిల్లీ తిహాడ్ జైలు సిబ్బందికి ప్రాథమిక శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. నేరాలు చేసిన వారిలో పరివర్తన తీసుకురావాల్సిన బాధ్యత జైలు అధికారులపై ఉందన్నారు. దిల్లీ తిహాడ్ జైలు సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి తెలంగాణ జైళ్ల శాఖను ఎంపిక చేయడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. ఇక్కడ 400 మందికి పైగా సిబ్బందికి శిక్షణ ఇచ్చే సామర్థ్యం ఉందని డీజీ డా.సౌమ్యమిశ్రా తెలిపారు. ఐజీ మురళీబాబు, డీఐజీలు డా.శ్రీనివాస్, సంపత్, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు గుడ్‌బై చెప్పండి

ఆయిల్, ఫాస్ట్ ఫుడ్ తగ్గించి పండ్లు, కూరగాయలు తీసుకోండి. ఇవి కొలెస్ట్రాల్ తగ్గించి గుండెను కాపాడుతాయి.



# ఉద్యోగులకు 'సర్కార్' భరోసా

- డిప్యూటీ సీఎం ఆదేశాలు
- ₹1000 కోట్ల బకాయిల విడుదల చేసిన సందీప్ కుమార్ సుల్తానియా

**ముద్ర హైదరాబాద్ :**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం ₹1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధుల విడుదల చేయటం జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అసెంబ్లీ లో ఇచ్చిన హామీ నెరవేర్చినారు. గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగి న చర్చల సందర్భంగా ప్రభు త్వం నెలకు ₹700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని ₹1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన వెయ్యి కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. మెడికల్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లకూ మోక్షం ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రోజు కూడా జాప్యం లేకుండా మెడికల్



బిల్లుల చెల్లింపులు రెగ్యులర్‌గా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు. వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. పెంచిన నిధులు, క్లియర్ అయిన జీపీఎఫ్ బకాయిలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.. ఉద్యోగ వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనే విషయాన్ని ఈ తాజా నిర్ణయం నిరూపిస్తోంది. "ఉద్యోగుల కష్టాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుంది" అని అధికారులు పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి చొరవతో పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



## ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం

**ముద్ర, కరీంనగర్ :**
మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి, శివ పంచాయత, శ్రీ సీతారామచంద్ర స్వామి, నవగ్రహాలు, ధ్వజస్తంభాలకు సంబంధించిన శిఖర సిర ప్రతిష్ట కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ శిఖర ప్రతిష్టను దర్శించారు. అనంతరం భక్తులతో కలిసి హారతులు స్వీకరించి దేవతల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం మరియు శిఖర ప్రతిష్ట వంటి పవిత్ర కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి, ఆధ్యాత్మిక చైతన్యానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, గోపు రమణ రెడ్డి, దొడ్ల మల్లికార్జున్, కృష్ణ గౌడ్, వెంకటేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కోదండరాంకు అభినందనలు

- సన్మానించిన బాలల హక్కుల సంఘం నాయకులు

**ముద్ర, హైదరాబాద్:**



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాంను బాలల హక్కుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం నిలకడలో ఉన్న సమయంలో 2012 సెప్టెంబర్ 30న సాగరహారానికి పిలుపునిచ్చి ఉద్యమానికి ఊపునిచ్చిన కోదండరాం పాత్రను గుర్తుచేశారు. అదేవిధంగా, రాష్ట్రంలో రిటైర్ అయిన పెన్షనర్లకు మార్చి 2024 నుంచి చెల్లించాల్సిన బకాయిలు నిలిచిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిల కోసం పెన్షనర్లు నిరసనలు, ధర్నాలు చేపడుతున్నారని, ఇప్పటికే పలువురు తమకు రావాల్సిన మొత్తాలు అందకుండానే మరణించినట్లు తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కోదండరాంను కోరినట్లు చెప్పారు. తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి చట్టసభల్లో ప్రత్యేకంగా కృషి చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసరాల్లో నివసిస్తున్న పిల్లలకు సరైన విద్యా సౌకర్యాలు లేక బాల కార్మికులుగా మారుతున్న పరిస్థితిని వివరించారు. అక్కడ విద్యా కమిషన్ సిఫారసుల మేరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రచ్చ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్జీ ఏదైనా.. పరిష్కారం పక్కా!

- ఆరెంపుల క్లస్టర్ 'ప్రజాదర్బార్'లో మంత్రి పొంగులేటి



**ముద్ర, ఖమ్మం:**
ప్రజా ప్రభుత్వం ప్రజల ముంగిటకే వచ్చిందని, ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**గడువులోగా పరిష్కారం.. అధికారులకు ఆదేశం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "సాధారణ సమస్యలను వారం రోజుల్లోనే పరిష్కరించాలని అధికారులకు సూచించాం. ఇక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు గరిష్టంగా 3 నెలల గడువు విధిస్తున్నాం. ఈలోపు ప్రతి దరఖాస్తుకు ఒక స్పష్టమైన పరిష్కారం చూపడమే మా లక్ష్యం" అని ప్రకటించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సాధాబైనామా సమస్యలను 45 రోజుల్లోనే కొలిక్కి తెస్తామని కీలక ప్రకటన చేశారు.

**పేదల సొంతింటి కల.. మా బాధ్యత**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇళ్లు లేక ఇబ్బంది పడ్డ పేదలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తూ పారదర్శకత పాటిస్తున్నాం అని తెలిపారు. త్వరలోనే రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. రూరల్ మండల పరిధిలోని 12 గ్రామాల్లో గత రెండున్నరేళ్లలో రూ.386 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.

**అన్నదాతకు వెన్నుదన్నుగా..**

రైతుల సంక్షేమంలో తమ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రూ. 20,656 కోట్లతో 25 లక్షల మందికి రైతు రుణమాఫీ పూర్తి చేశామని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ల కోసం వేచి చూస్తున్న అర్హులకు త్వరలోనే శుభవార్త చెబుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల చీఫ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ పెట్టేటన్ని డబ్బులు కవితకు ఎక్కడివి..?

- కేసీఆర్ కుటుంబం ముందు ఆస్తి తగాదాలు పరిష్కరించుకోవాలి..
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..
- ధర్మారం మండలం మక్కల, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి

**ముద్ర, ధర్మారం:**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం అక్రమంగా సంపాదించిన ఆస్తుల పంచాయితీ పరిష్కరించుకున్న తర్వాత ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం ధర్మారం వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. నంది మేడారం, చామన్ పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిగిపోవాలి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని హరీష్ రావు తో పాటు కొత్తగా పార్టీలో చేరిన జీవన్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం ముందు ఆస్తుల పంచాయతీ పరిష్కరించుకున్న తర్వాత ప్రజా ప్రభుత్వంపై మాట్లాడాలని చేయాలని మంత్రి సూచించారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దిగిపోవాలని మంత్రి ప్రశ్నించారు.



కేసీఆర్ కూతురు కవితకు పార్టీ పెట్టె అన్ని డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం మక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. మక్కజొన్న రైతులకు మద్దతు కల్పించాలని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. మక్కజొన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకొని రైతులు మద్దతు ధర పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించి చేతులు దులుపుకుంటుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. గత ఖరీఫ్ సీజన్ లో రైతుల వద్ద సేకరించిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సీఐ ద్వారా వెంటనే సేకరించి యాసంగి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రబీ సీజన్ లో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. చామనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇరిగేషన్ శాఖ ద్వారా సంప్రదింపులు జరిపి కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద బోరుబావి తవ్వించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో అంబేద్కర్ భవనం ఏర్పాటు తోపాటు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

## ఘనంగా స్థంభాద్రి లక్ష్మీ నరసింహుని జయంతి ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి తుమ్మల

**ముద్ర, ఖమ్మం :**
స్థంబాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. స్థంబాద్రి లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించే అదృష్టం నాకు కలిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నానని అన్నారు. ఖమ్మం నగర అభివృద్ధిలో భాగంగానే కాకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు ఏ విధంగా ఉన్నా రైతాంగానికి కరువు కాటకాలు లేకుండా ఉగ్ర నరసింహ స్వామి దయ ఉండాలని ప్రార్థించారు.



# టెన్త్ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విజయ దుందుభి



**ముద్ర, కరీంనగర్**
విద్యార్థులకు పటిష్టమైన ప్రణాళికలను రూపొందిస్తూ వారిని సంచలనాత్మక విజయాలను నమోదు చేస్తున్నామని అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా టెన్త్ ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలను సాధించడం అల్ఫోర్స్ విద్యా విధానానికి ఒక గొప్ప ప్రతీక అని వారు గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తూ తరగతి గదిలో బోధించినటువంటి విషయాలు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ అద్భుతమైనటువంటి ఫలితాలు వైపు పయనించాలని వారు సూచించారు. అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఆర్.సాత్విక్ 589 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడని, ఓ.ఆద్య, టి.రాజు, బి.అక్షిత్ రెడ్డి, 588 మార్కులు సాధించారని, 1274 మంది విద్యార్థులకు 1026 విద్యార్థులు 500 మార్కులు పైన సాధించడం చాలా స్ఫూర్తిదాయకమని చెప్పారు. 48 మంది విద్యార్థులు 580 మార్కులు పైగా సాధించారని మరియు 334 మంది విద్యార్థులు 560 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన విజయాల సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. అనునిత్యం వారి పిల్లలకు ప్రోత్సాహం అందిస్తూ లక్ష్యాల వైపు పయనించే విధంగా ప్రోత్సహిస్తున్నటువంటి తల్లిదండ్రులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అద్భుతమైనటువంటి ఫలితాలను సాధింపజేసినందుకు నరేందర్ రెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసించి, ఘనంగా సత్కరించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 30.04.2026
4
వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఆరోగ్యానికి ఆటలు



1. బయట ఆటలు శరీరానికి మంచి వ్యాయామం ఇస్తాయి. పరుగులు, క్రీడలు చేయడం వల్ల శక్తి పెరుగుతుంది. సూర్యకాంతి వల్ల విటమిన్ D లభిస్తుంది. ఇవి మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
2. క్రికెట్, ఫుట్‌బాల్ వంటి టీమ్ గేమ్స్ సామూహిక భావనను పెంచుతాయి. ఇవి కలిసి పనిచేసే నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తాయి. శారీరక చురుకుదనం కూడా పెరుగుతుంది. మానసిక ఆనందం కలుగుతుంది.
3. యోగా మరియు తేలికపాటి వ్యాయామాలు శరీరాన్ని సడలిస్తాయి. ఇవి శ్వాస నియంత్రణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడి తగ్గించడంలో సహాయపడతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది.
4. చెస్ వంటి మైండ్ గేమ్స్ ఆలోచన శక్తిని పెంచుతాయి. ఇవి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. మెదడు చురుకుగా ఉంటుంది. జ్ఞాపకశక్తి కూడా బలపడుతుంది.
5. దాగుడుమూతలు వంటి ఆటలు పిల్లలకు చురుకుదనం ఇస్తాయి. ఇవి శరీర కదలికలను మెరుగుపరుస్తాయి. సరదాగా ఉండే ఆటలు కావడం వల్ల ఆనందం పెరుగుతుంది. స్ట్రెస్ తగ్గుతుంది.
6. స్కిప్పింగ్ (జంప్ రోప్) గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది స్టామినా పెంచడంలో సహాయపడుతుంది. రోజూ కొంతసేపు చేయడం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో ఉంటుంది.
7. సైక్లింగ్ శరీరానికి పూర్తి వ్యాయామం ఇస్తుంది. కాళ్ల బలం పెరుగుతుంది. గుండె పనితీరు మెరుగవుతుంది. బయట గాలి వల్ల మనసు తాజాగా ఉంటుంది.
8. బ్యాడ్మింటన్ వేగం మరియు ఫోకస్ పెంచుతుంది. ఇది కంటి–చేతి సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం చురుకుగా ఉంటుంది. ఫిట్‌నెస్ మెరుగుపడుతుంది.
9. ఈత (స్విమ్మింగ్) శరీరానికి పూర్తి వ్యాయామం ఇస్తుంది. ఇది కండరాల బలం పెంచుతుంది. శరీరం సడలుగా ఉంటుంది. మానసిక ప్రశాంతత కూడా పెరుగుతుంది.
10. కబడ్డీ వంటి సంప్రదాయ ఆటలు శక్తి మరియు ధైర్యం పెంచుతాయి. ఇవి శరీర నియంత్రణను మెరుగుపరుస్తాయి. టీమ్ స్పిరిట్ పెరుగుతుంది. ఆరోగ్యం బలపడుతుంది.
11. యోగా గేమ్స్ లేదా ఫన్ యాక్టివిటీస్ పిల్లలకు ఆసక్తిని పెంచుతాయి. ఇవి శరీరాన్ని సడలిస్తాయి. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఆరోగ్యకరమైన అలవాట్లు పెరుగుతాయి.
12. పజిల్స్ మరియు బ్రెయిన్ గేమ్స్ మెదడుకు వ్యాయామం ఇస్తాయి. ఇవి సమస్యలను పరిష్కరించే నైపుణ్యాన్ని పెంచుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది.
13. డాన్స్ కూడా ఒక మంచి వ్యాయామం. ఇది శరీరాన్ని ఫిట్‌గా ఉంచుతుంది. సంగీతంతో పాటు చేయడం ఆనందాన్ని ఇస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది.
14. మార్నింగ్ వాక్ ఒక సులభమైన ఆరోగ్యకరమైన అలవాటు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం చురుకుగా ఉంటుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.
15. ఇంటి వద్ద చిన్న ఆటలు కూడా ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆడడం ఆనందాన్ని పెంచుతుంది. మానసిక రిలాక్సేషన్ కలుగుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పడుతుంది.

### ఎండాకాలంలో పానీపూరి తినడం

# శరీరానికి మంచిదేనా..

ఎండాకాలంలో సాధ్యమైనంతవరకు శరీరానికి చలవచేసే పదార్థాలను తినాలని వైద్యులు చెబుతుంటారు. మజ్జిగ, పెరుగు, నిమ్మకాయ షర్బత్, పుదీనా షర్బత్, చల్లని నీళ్లు, కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ, కర్బుజా, కీరా దోసకాయ్ తీసుకోవాలని చెబుతుంటారు. మధుమేహం, రక్త పోటు వంటి సమస్యలు ఉన్నవారు తమ ఆరోగ్య స్థితి ఆధారంగా వీటిని తీసుకోవాలని చెబుతుంటారు.

ఎండాకాలంలో లభించే పండ్లను కూడా తీసుకుంటే శరీరానికి చలవ చేస్తుందని వైద్యులు చెబుతుంటారు.. అయితే కొందరు మాత్రం నోటిని కట్టేసుకోరు. సాయంత్రం పూట బయట దొరికే చిరుతిళ్లను తింటుంటారు. అందులో ప్రధానమైనది పానీపూరి. ఒకప్పుడు పట్టణ, నగర ప్రాంతాలకు మాత్రమే పానీ పూరి బండ్లు పరిమితమయ్యేవి. ఇప్పుడు మారుమూల గ్రామాల్లో కూడా పానీపూరి బండ్లు వచ్చేశాయి. సాయంత్రం అయిందంటే చాలు చాలామంది పానీపూరిని ఇష్టంగా తింటారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. కొంతమంది నిర్వాహకులు పానీపూరి తయారీలో శుభ్రతను పాటించరు. దానివల్ల రకరకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలో పానీపూరి తిని ఏడు సంవత్సరాల బాలుడు చనిపోయాడు. ఈ వార్తల నేపథ్యంలో పానీపూరి తినే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.. పానీపూరి తయారీలో కలుషితమైన నీటిని వాడితే.. అది తిన్నవాళ్లకు ప్రమాదాలు తప్పవు. కలుషితమైన నీటిలో బ్యాక్టీరియా ఉంటుంది. నీటిలో నుంచి నోటిలోకి వచ్చిన తర్వాత అది వేగంగా వ్యాపిస్తుంటుంది. ఉడకబెట్టిన ఆలు, శనగలు ఎండ వేడి వల్ల పాడవుతాయి. అలాంటి వాటిని తింటే కచ్చితంగా వాంతులు వస్తాయి. విరోచనాలు కూడా చోటుచేసుకుంటాయి. దీనివల్ల శరీరం డిహైడ్రేషన్ కు గురవుతూ ఉంటుంది. అలాంటప్పుడు ప్రాణాపాయం సంభవిస్తూ ఉంటుంది.

సాధ్యమైనంత వరకు పానీపూరిని బయట తినకపోవడం మంచిదని వైద్యులు అంటున్నారు. ఒకవేళ అంతగా తినాల్సి వస్తే శుభ్రంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని తినాలని చెబుతున్నారు. సాధ్యమైనంతవరకు పానీపూరి విషయంలో జాగ్రత్తగా ఉంటేనే ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని చెబుతున్నారు. ఎందుకంటే కలుషితమైన నీటి ద్వారా ఈ. కోలై బ్యాక్టీరియా అభివృద్ధి చెంది శరీరంలోకి ప్రవేశిస్తుందని.. తద్వారా అనారోగ్యానికి కారణమవుతుందని హెచ్చరిస్తున్నారు.

# 'మేడే' స్ఫూర్తి: కార్మిక హక్కుల కోసం ఉద్యమిద్దాం

అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాల సంఘీభావ దినమైన' మే 1'న వాడవాడలా ..కార్మిక పారిశ్రామిక వాడల్లో కార్మికుల ఐక్యతను చాటుదాం! హక్కుల కోసం ఉద్యమించుదాం! పాలకుల కళ్ళు తెరిపిద్దాం!

★78 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తూ వస్తున్న కార్మిక వర్గం.. పోరాడి సాధించుకున్న అనేక కార్మిక సంక్షేమ చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ వస్తున్నారు. 2014లో అధికారంలోనికి వచ్చిన బిజెపి – మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పెట్టుబడిదారీ విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను సమూలంగా రద్దుచేసి, పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు, బడా వ్యాపారస్తులకు అనుకూలంగా 4 లేబర్ కోడులు తెచ్చింది.




## నూతన లేబర్ కోడుల అమలు :-

ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుండి నూతన లేబర్ కోడ్స్ అమలుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కోడుల వల్ల కార్మికుల పనిగంటలను 12 గంటలకు పెంచి కార్మిక చట్టాలు అనేక సవరణలు చేసి సమ్మె హక్కును తొలగించటం, కేంద్ర ప్రభుత్వం భారత శిక్షాస్మృతి 2024 చట్టం, సెక్షన్ 111 ద్వారా కార్మికులు చార్టెడ్ ఆఫ్ డిమాండ్స్ ఇచ్చినా, నిరసనలు తెలియజేసినా, సమ్మె నోటీసు ఇచ్చినా, కార్మికులు, కార్మిక నాయకులపై బెయిల్ దొరకని సెక్షన్ ద్వారా జైల్లో పెట్టే అధికారం బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఆ చట్టం వల్ల కార్మికుల ఉద్యమాలను, పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేయటమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నది. కనీస వేతనాల చట్టాన్ని, పేమెంట్ ఆఫ్ వేజెస్, పి ఎఫ్, ఇఎస్ఐ, ప్రమాదం నష్ట పరిహారం చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్మికులకు ఏ విధమైన హక్కులు లేకుండా మోడీ ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి అమల్లోనికి తెచ్చింది.

వ్యవసాయ రైతాంగ వ్యతిరేక 3 చట్టాలు.. విద్యుత్ బిల్లులను బలవంతంగా రైతులపై ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసింది. రైతుల నల్ల చట్టాలను రద్దు చేయాలని 13 నెలల పాటు చలిని, వానను,ఎండను లెక్కచేయకుండా రైతులు కొనసాగించిన పోరాటానికి మోడీ మోకాళ్లపై కూర్చుని క్షమాపణ కోరుతూ రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. కానీ ఆ చట్టాలు రద్దు చేసినప్పటికీ గతంలో ఉన్నటువంటి రైతు అనుకూల చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది.

నరేంద్ర మోడీ నాయకత్వంలో మోసపూరిత కుట్రల, కుతంత్రాల ప్రభుత్వం నడుస్తున్నది. మొదట్లో నష్టం వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వరం చేస్తామన్నారు. ఇప్పుడు లాభాలు వచ్చే సంస్థలను కారు చౌకగా అమ్మకానికి పెట్టారు. 'ఏకంగా ప్రభుత్వం వ్యాపారం చేయదు' అని చెబుతూనే మొత్తం పరిశ్రమలు, గనులు,రవాణా, టెలికాం, బ్యాంకులు, ఎల్ఐసి కంపెనీలు ఆఖరికి దేశ రక్షణ కోసం అహర్నిశలు పనిచేసే డిఫెన్స్( రక్షణ) కంపెనీలు, ల్యాబ్ లు, ఇస్రో లాంటి ప్రతిష్టాత్మకమైన పరిశోధన సంస్థలను కూడా అంబానీ, ఆదాని లాంటి పెట్టుబడిదారులకు కారు చౌకగా బంగారు పళ్లెంలో పెట్టి అందిస్తున్నారు. వీటితో సంతృప్తి చెందని భకాసురులైన పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం "నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ " పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను 30 నుండి 90 సంవత్సరాల వరకు లీజులతో ధారాదత్తం చేస్తున్నారు.

భారతదేశం నేడు 275 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. ప్రతి పౌరుడి తల పై మూడు లక్షల రూపాయల అప్పు ఉందంటే భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఊహించుకోవచ్చు.

కార్మికులు తమ కష్టార్జితం నుండి దాచుకొని పదవి విరమణ తర్వాత అండగా ఉంటుందన్న ఆశతో పిఎఫ్ పథకంలో దాచుకున్న కార్మికుల పెన్షన్ డబ్బులు రూ.36 వేల కోట్ల రూపాయలను, ఆదానికి అప్పు ఇస్తే రెండు నెలల వడ్డీ మాత్రమే చెల్లించి చేత్తేసిండు. పి ఎఫ్ పై వడ్డీ రేట్లు 9.5 నుండి క్రమంగా 8.4 శాతానికి తగ్గిస్తూ బిజెపి ప్రభుత్వానికి కార్మికుల యెడల ఉన్న వ్యతిరేకత ధోరణి తేటతెల్లమవుతుంది

ఈ నేపథ్యంలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులకై, ప్రజా,కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినం కోసం చికాగో కార్మికులు పోరాటం చేసి చిందించిన రక్తమే 'మే డే'.

నేడు ఆ స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమిస్తూ.. పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటీ, బోనస్, పెన్షన్ చట్టాలను అమలు చేయాలిని, హక్కుల సాధనకై మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం.. పాలకుల కళ్ళు తెరిపిద్దాం!

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి
మే డే వర్ధిల్లాలి



- ఉజ్జిని రత్నాకర్ రావు
-9490952646
ఏఐటీయుసీ -సీనియర్ నాయకులు

# అభ్యుదయ కవి శ్రీ శ్రీ

**ఏప్రిల్ 30... మహాకవి శ్రీ శ్రీ జయంతి**

ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగా లబ్ద ప్రతిష్టులైన శ్రీశ్రీ (ఏప్రిల్ 30, 1910 – జూన్ 15, 1983). విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికులు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందారు. శ్రీశ్రీ పుట్టిన దినం గురించి, ఫిబ్రవరి 1, 1910 న జన్మించానని ఆయన విశ్వసించినా, పరిశోధకులు కొందరు 1910 ఏప్రిల్ 15న జన్మించారని పేర్కొన్నా, విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన తేదీనే 1910 ఏప్రిల్ 30 అని విరసం వారు స్పష్టీకరించారు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్ సీ వుత్తీర్ణుడు అయినారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బియ్యే (జంతుశాస్త్రము) పూర్తి చేసారు.

1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది.1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటర్ గా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు.

1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ భార్యగా వివాహమాడారు.

1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్లో ఒక ప్రచార సభలో, ఆయన ఆరోగ్యం దెబ్బతిని, కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో, శ్రీశ్రీ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి, ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపారు.

శ్రీ శ్రీ ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు తదితరాలు. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసారు.

1970లో ఆయన షష్టిపూర్తి ఉత్సవం సందర్భంగానే అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. 18 వ ఏట 1928 లో "ప్రభవ" అనే కావ్య సంపుటిని ప్రచురించారు. 1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు. తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను అయన రచించారు. అల్లూరి సీతా రామ రాజు సినిమాకు రాసిన "తెలుగు వీర లేవరా.." అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజతో కలిసి సినిమాలకు మాటలు రాసారు.

తెలుగులో మొట్టమొదటి డబ్బింగ్ సినిమా ఆహుతికి శ్రీ శ్రీ మాటలు పాటలు వ్రాశారు.

బి.విఠలాచార్యతో పరిచయం కలిగిగాక, అయన కన్నడలో తీసిన కన్యాదానం అనే సినిమాను తెలుగులో కూడా నిర్మించదలచి శ్రీశ్రీని రచయితగా నియమించుకున్నారు. శ్రీ శ్రీ మైసూరులో వుండి ఒక్కరోజులో 12 పాటలు వ్రాశారు. ఇది ప్రపంచ చలనచిత్ర లోకంలో ఒక రికార్డు!

మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి)
హలో హలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు) నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన)
తెలుగువీర లేవరా (అల్లూరి సీతారామరాజు) పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు) శ్రీ శ్రీ గీతాలలో కలికి తురాయిలు.

తెలుగే మన జాతీయ భాష కావాలనేది తన అభిమతం అన్నారు. ఇది భాషా దురభిమానంతో అంటున్న మాటకాదని, తెలుగు భారతదేశం అంతకీ జాతీయభాష కాగల అర్హత గలదని జె.బి.యస్.హాల్డేన్ అన్నారని, సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత, అటు ఉత్తరాదివారికీ, ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాది వారికీ, తెలుగు నేర్చుకోవడం చాలా సులభమని హాల్డేన్ పండితుని వాదనతో శ్రీ శ్రీ ఏకీభవిస్తున్నా నన్నారు.



రామ కిష్టయ్య సంగనభట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30-04-2026
www.mudranews.in | @mudranews



## ధూమపానం, మద్యపానం మానండి



స్మోకింగ్ గుండెకు పెద్ద శత్రువు. మద్యపానం కూడా రక్తపోటు పెంచి ప్రమాదాన్ని పెంచుతుంది.

## పదో తరగతి ఫలితాల్లో
# నాగర్ కర్నూల్‌కు రాష్ట్రంలో ద్వితీయ స్థానం



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: పదో తరగతి ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి విశేష ప్రతిభ చాటుకుంది. మొత్తం 10,641 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 10,538 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 254 పాఠశాలల్లో 208 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించగా, వాటిలో 149 ప్రభుత్వ పాఠశాలలు ఉండటం ప్రత్యేకత. అలాగే 20 కేజీబీవీలలో 19 పాఠశాలలు సంపూర్ణ ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఈ విజయంపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన ఫలితాలు రావడం విద్యా ప్రమాణాలు పెరుగుతున్న సంకేతమని తెలిపారు.

## గద్వాల జిల్లాకు 29వ స్థానం

ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్ర స్థాయిలో 29వ స్థానంలో నిలిచింది. జిల్లా విద్యార్థులు 93.93 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 8,037 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 7,549 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 91.74 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే ఈసారి 1.19 శాతం పెరుగుదల నమోదైంది. అయితే గత ఏడాది 26వ స్థానంలో ఉన్న జిల్లా ఈసారి 29వ స్థానానికి చేరింది. బాలికలు మరోసారి మెరుగైన ప్రతిభ కనబరిచారు. 4,190 మంది బాలికల్లో 4,001 మంది (95.49%) ఉత్తీర్ణులు కాగా, 3,847 మంది బాలురలో 3,548 మంది (92.23%) ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 488 మంది అనుతీర్ణులయ్యారు.

## కేజీబీవీ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు



ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: బుధవారం వెలువడిన పదో తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గద్వాల మండలం గోనుపాడు కేజీబీవీలో మొత్తం 40 మంది విద్యార్థినిలకు 39మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. వి.దీక్ష 574 అత్యధిక మార్కులు సాధించి టాపర్ గా నిలిచిందని ఎస్ఓ తెలిపారు. కేటిదొడ్డి కేజీబీవీ పాఠశాలల్లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు, కె.విజయమ్మ 562 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచిందని ఎస్ఓ పద్మ తెలిపారు. దరూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో 40 విద్యార్థినులకుగాను 40 మంది ఉత్తీర్ణులయ్యారు.

# విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా ఎదగాలి

### - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: విద్యార్థులు టీనేజ్‌లో కలిగే ఆకర్షణల పట్ల అప్రమత్తంగా ఉండి బాధ్యతగల పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం గోనుపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తెలిపారు. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు వృత్తి విద్యను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగాలతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించవచ్చని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్రగ్స్ నివారణ, పిల్లల భద్రతపై గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సునంద, కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, బాలల సంరక్షణ అధికారి నరసింహ, ఇతర అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

ముద్ర, వికారాబాద్: జిల్లాలోని పెద్దేముల్ మండలం కొండాపూర్ లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం పెను విషాదాన్ని నింపింది. పిడుగు పడటంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కోడి ఆనందం, నిరటి నర్సింలు, జాను అనే ముగ్గురు మేకల కాపరులు ఎప్పటిలాగే మేకలను తోలుకుని గ్రామ శివారుకు వెళ్లారు. సాయంత్రం వేళ అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడటంతో ముగ్గురు కాపరులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వీరిని తాండూరు లోని జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే కోడి ఆనందం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిరటి నర్సింలు, జానులు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.

# గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

### - కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: గ్రామాల సమగ్ర అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలకంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో 460 గ్రామపంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత పాటిస్తూ, సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతులు, హరితహారం వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. త్వరలో క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి పనితీరును అంచనా వేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పాఠశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలను అధికారులు పరిశీలించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటి ప్రాజెక్టులు, భూసేకరణ పనులు వేగవంతం చేయాలి..



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు మరియు జాతీయ రహదారి భూసేకరణ పనులను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సంబంధిత శాఖల పనితీరును పరిశీలించారు. పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు నిబంధనల ప్రకారం సముచిత పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారి 167కే విస్తరణ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పనుల నాణ్యతలో రాజీ లేకుండా ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనిచేయాలని అధికారులకు సూచించారు.

## ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు విజయవంతం



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్‌లో ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీ జీడీఏ) ఆధ్వర్యంలో నిర్వహించి తంగా, విజయవంతంగా పూర్తయ్యాయి. జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ రచ్చ రఘు ఘన విజయం సాధించారు. ఆయన రెండు సంవత్సరాలపాటు జిల్లా అధ్యక్షునిగా కొనసాగనున్నారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో తొలిసారిగా నిర్వహించిన ఈ ఎన్నికలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి మార్గదర్శకత్వంలో నిర్వహించగా, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్. రాజేష్ గౌడ్ సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఈ ఎన్నికల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్‌కు చెందిన వైద్యులు పాల్గొన్నారు. మొత్తం 70 మంది ఓటర్లలో 60 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, అందులో రెండు ఓట్లు చెల్లనివిగా ప్రకటించబడ్డాయి. ఓట్ల ఫలితాలు ఇలా ఉన్నాయి: డాక్టర్ రచ్చ రఘు – 31 ఓట్లు, డాక్టర్ శేఖర్ – 27 ఓట్లు.

ఈ ఎన్నికల్లో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ మరియు విభాగాధిపతి డాక్టర్ రచ్చ రఘు విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్. రాజేష్ గౌడ్ అధికారికంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రతి సహచర వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వైద్యుల హక్కులు, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని, జిల్లాలో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ ఎన్నికలతో జిల్లాలో ప్రభుత్వ వైద్యుల ఐక్యత మరింత బలపడటంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి బలమైన వేదిక ఏర్పడిందని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు.

## అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు

### - ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



ముద్ర, తాండూర్: అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూర్ నియోజక వర్గం బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇందర్ చేడ్ గ్రామంలో మండిగి రమేష్, కాశీంపూర్ లో పట్లోళ్ళ చంద్రకళ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా తమ సొంతింటి కల నెరవేరినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మనో రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు.

## యూజీడీ పనులకు శంకుస్థాపన



ముద్ర, మల్కాజిగిరి: మల్కాజి గిరి నియోజకవర్గంలోని వినాయక డివిజన్ పరిధిలోని వెస్ట్ కాకతీయ నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి యూజీడీ పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించ డమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్ డివిజన్ ప్రెసిడెంట్ తులసి సురేష్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, బద్దం హేమంత్ రెడ్డి, పేపర్ శీను, ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా..

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




ముద్ర, కాప్రా: కాప్రా డివిజన్ పరిధిలోని కాలనీలను ప్రణాళికా ద్ధంగా అభివృద్ధి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు, కాప్రా డివిజన్ పరిధిలోని అశోక్ కాలనీ, సాయి సుమ ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.


## నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో
# అధిక మొత్తంలో మొక్కజొన్న సాగు

### - ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో అధిక మొత్తంలో మొక్కజొన్న పంట సాగు జరిగిందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందని, గత 15 రోజులుగా నిరంతరంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే హమాలీల కొరత కారణంగా లోడింగ్ పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బీహార్ నుంచి కూలీలు వచ్చినప్పుడే పనులు పూర్తవుతున్న పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. కొంతమంది రాజకీయ నాయకులు ధర్నాల పేరుతో రైతులను రెచ్చగొట్టొద్దని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే తీరుపై విమర్శలు గుప్పిస్తూ, మొక్కజొన్న కొనుగోళ్ల అంశాన్ని రాజకీయాలకు వాడ కుంటున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో "మొక్కజొన్న వేయొద్దు, కొనుగోలు చేయం" అంటూ రైతులను తప్పుదోవ పట్టించారని, ఇప్పుడు రైతులు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో సానుభూతి చూపకుండా రాజకీయాలు చేయడం తగదని మండిపడ్డారు. రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించ వద్దని సూచిస్తూ, ప్రభుత్వం, స్థానిక ఎమ్మె ల్యేపై అనవసర ఆరోపణలు చేయొద్దని అన్నారు. రైతుల పక్షాన నిలబడి వారికి సహాయం చేయాలని, కనీసం వారి బాధను అర్థం చేసుకోవాలని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.


# వివాహ కార్యక్రమాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



ముద్ర, తాండూర్: తాండూర్ పట్టణంలో పలు వివాహ శుభ కార్యక్రమాల్లో పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. పెద్దేముల్ మండలం కొండాపూర్ యువ నాయకులు నరేందర్ వివాహ వేడుకలో, క్యాద్గిర సీనియర్ నాయకులు భీమయ్య సోదరుని కూతురు వివాహ వేడుకలో, గాజీపూర్ గ్రామం మంగలి కృష్ణ కూతురు వివాహ వేడుకలో, సల్ల గార్డెన్స్ లో శరణ్ బస్వరాజు కుమారుడి వివాహ వేడుకలో, ఆర్యవైశ్య మినీ ఫంక్షన్ హాల్ లో అగ్గనూర్ గ్రామం కాశీనాథ్ రెడ్డి కుమారుని వివాహ వేడుకలో, తులసి గార్డెన్స్ లో ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు సోదరుని కుమారుని వివాహ వేడుకలో, వినాయక కన్వెన్షన్ లో సాయి కిరణ్ వివాహ వేడుకలో, వెంకోబ గార్డెన్ లో గిరిజపూర్ వాస్తవ్యులు రాంచందర్ గౌడ్ కుమారుని వివాహ వేడుకలో, ఎన్.ఎం ఫంక్షన్ హాల్ లో గొట్టిన కలాన్ వాస్తవ్యులు నీలి శ్రీనివాస్ కూతురి వివాహ వేడుకలో, ఎస్ వి ఆర్ గార్డెన్స్ లో యాలాల్ ఆర్ఐ వేణు సోదరుని వివాహ వేడుకలో మరియు పలు వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఒత్తిడిని నియంత్రించండి:**

ధ్యానం, యోగా, హాబీలు ఒత్తిడిని తగ్గిస్తాయి.
మానసిక ప్రశాంతత గుండె ఆరోగ్యానికి కీలకం.



# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

**- నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఇసుక అక్రమ రవాణా సహా పలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణ ఉంచాలని తెలిపారు. నిబంధనల ప్రకారమే ఇసుక అమ్మకాలు జరగాలని పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భూ భారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కు సంబంధించి ఓటర్ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అక్విజిషన్ నాయక్వాడి జల కుమారి, సీపీఓ జీవరత్నం, మైన్స్ ఏడీ హరి ప్రసాద్, ఏడీ ల్యాండ్ సర్వేయర్ నరసింహ మూర్తి, తహసీల్దార్ లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోస్టర్ల ఆవిష్కరణ..**

అనంతరం మే 6న నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు.

## పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ కు మూడో స్థానం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా మరోసారి సత్తా చాటింది. గతంలో రెండు సార్లు మొదటి స్థానాన్ని పొందిన నిర్మల్ గతేడాది 15వ స్థానానికి పరిమితమైంది. ఈసారి మూడో స్థానానికి ఎగబాకింది. ఈ సంవత్సరం జిల్లాలో 9,743 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,779 మంది బాలురు, 4964 మంది బాలికలు హాజరయ్యారు. బాలురలో 4,711 మంది, బాలికల్లో 4,934 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలుర శాతం 98.58, బాలికల హాజరు శాతం 99.34 కాగా, మొత్తం 98. 96 శాతంగా నమోదైంది.

**సమిష్టి కృషి తోనే ఫలితాలు:**



పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడో స్థానం సాధించటం పట్ల డీఈఓ భోజన్న హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు తదితర జిల్లా ఉన్నతాధికారుల మార్గదర్శనం, ఉపాధ్యాయులు,విద్యార్థుల నిరంతర కృషి ఇందుకు కారణమని ఆయన తెలిపారు.

# పది ఫలితాల్లో జగిత్యాలకు నాలుగో స్థానం

**- విద్యాశాఖ అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లాలోని విద్యార్థులు ప్రతిభ చాటారు. అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 12,687 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఇందులో 12,544 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.87 శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లాలో కేవలం 143 మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారు. జిల్లాలోని బుగ్గారం, బీర్పూర్, మల్లాపూర్, సారంగాపూర్ మండలాల్లో వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. అయితే జిల్లాను నాలుగో స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్ సత్యప్రసాద్ బు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా**




**బోథ్, ముద్ర:**
సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం స్థానిక టీటీడీసీలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతికత ఎంతగా విస్తరిస్తోందో, అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యావంతులు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ ఐఐటీ ప్రొఫెసర్ సుమారు 4 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్ల చేతిలో పోగొట్టుకున్న ఉదంతాన్ని ఉదహరించారు. నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతులతో ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా ముఖాలు, గొంతులను మార్చి వీడియోలు సృష్టించడం, పోలీసుల పేరుతో డిజిటల్ అరెస్ట్' చేస్తామని భయపెట్టి డబ్బులు వసూలు చేయడం వంటి మోసాలు పెరిగిపోయాయని వివరించారు. గిఫ్ట్ కార్డ్ ఫ్రాడ్స్, కేవైసీ అప్‌డేట్, క్యూఆర్ కోడ్ స్కామ్స్ పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని కోరారు. సైబర్ నేరాల నుంచి రక్షణ పొందడానికి ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ముఖ్యంగా ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని వివరించారు. ఆన్‌లైన్‌లో వచ్చే కాల్స్ అనుమానాస్పదంగా ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాలు, నేషనల్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రిన్సిపాల్, పోలీస్, మహిళా, శిశు సంక్షేమ, ఇతర శాఖల అధికారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా పునరుద్ధరణ



**మహాదేవపూర్, ముద్ర:**
మండల కేంద్రంలో మోటార్ కు మరమ్మతు చేపట్టడంతో తాగు నీటి సరఫరా పునరుద్ధరించబడింది. ఇటీవల గ్రామంలోని గడి హనుమాన్ 120 కే ఎల్ ట్యాంకు మోటర్ దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సర్పంచ్ హసీనా బాను స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టారు. దీంతో తాగునీటి కొరత లేకుండా నిరంతర సరఫరా పునరుద్ధరించబడింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రశేఖర్, నయుమ్, రాములు, గ్రామపంచాయతీ సిబ్బంది కుతుబ్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరించాలి

**ముద్ర, కరీంనగర్:**
గ్రామ అభివృద్ధికి పూర్వ ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధికి సహకరించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ దుర్గపు సుజాత ఆధ్వర్యంలో గ్రామ పూర్వ ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రథమ సర్పంచ్ మొదలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**- ఎస్సై రమేష్**

**- మత్తు పదార్థాల కలిగే అనార్థలపై పోలీసుల అవగాహన**




**మహదేవపూర్, ముద్ర:**
యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, చదువు, నైపుణ్యాలపై దృష్టి సారించాలని స్థానిక ఎస్సై రమేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై పడే ప్రభావాలను వివరించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కాలేయం, గుండె, మెదడు దెబ్బతినడం, మానసిక వ్యాధులు రావడం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పాడుతాయని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే చదువు, ఉద్యోగం, కుటుంబ పరువు కోల్పోయి నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం పూర్తిగా నిషేధమని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంఘ వ్యతిరేక కార్యకాలపాల గురించి ప్రజలు నిర్భయంగా సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు. మత్తు వద్దు భవిష్యత్తు ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. యువత ఒక లక్ష్యాన్ని ఎందుకోని ముందుకు సాగాలని కోరారు. అప్పుడు మాత్రమే మన జీవితం సాఫీగా జరుగుతుందని హితబోధ చేశారు.లక్ష్యం లేని జీవితం దుర్భరంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**ముద్ర, ఎండపల్లి:** ఎండపల్లి మండలంలోని గుల్లకోటలో భూసారపు భూమయ్య ఇందిరమ్మ ఇల్లును బుధవారం సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. కాగా భూసారపు భూమయ్య – భూలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్ వివాహం అంజలితో కాగా మంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## విద్యాశాఖకు కలెక్టర్ అభినందనలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించటం పట్ల కలెక్టర్ భవేష్ మిశ్రా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న సహా విద్యా శాఖ సిబ్బందికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**బోథ్, ముద్ర:** మండల కేంద్రంతో పాటు పిప్పలదరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం బోథ్ ఎంపీడీఓ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ మార్చి 19 వరకు డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మిగిలిన కూలీ డబ్బులు కూడా త్వరలోనే జమ అవుతాయని తెలిపారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 5:30 నిమిషాలకే పనికి హాజరయ్యి 9:30 నిమిషాలకు వరకు ముగించాలని పేర్కొన్నారు. కొలతల ప్రకారము పనిచేస్తే గరిష్ట కూలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జగ్దేరావు, ఈసీ మధుకర్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల పోస్టర్ల ఆవిష్కరణ




**మహాదేవపూర్, ముద్ర:** కాళేశ్వర క్షేత్రంలో మే 21 నుంచి జూన్ 1 వరకు జరిగే సరస్వతి నది అంత్య పుష్కరాల వాల్ పోస్టర్లను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ధార్మిక సలహాదారు గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఆర్ జేసీరామకృష్ణారావు, ఆలయ కార్య నిర్వహణాధికారి మహేష్, చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో మాస్ట్రో ప్రభంజనం



**ముద్ర, కోరుట్ల:** పదో తరగతి పరీక్షల ఫలితాల్లో కథలాపూర్ మండల కేంద్రంలోని మాస్ట్రో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. ఏలేటి పార్వతి 587 మార్కులు రాగా, జిల్లా స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించింది. శనిగారపు ప్రణయ్ 571, బత్తుల నిఖిల్ 569 మార్కులతో విజయ కేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఆకుల రాజేష్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్ రాజేందర్, అధ్యాపక బృందం అభినందించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సరిపడిన నిద్ర అవసరం**

సరిపడిన నిద్ర అవసరం రోజుకు 6–8 గంటలు గాఢ నిద్ర తీసుకోవాలి.నిద్రలేమి గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.



## నిరుపేద యువకునికి ఆర్థిక సాయం



**ముద్ర, మోత్కూర్ :** మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన సీపీఐ నాయకులు, మాజీ ఆంధ్ర భూమి రిపోర్టర్ కంచి నర్సయ్య కుమారుడు శ్రీ నాథ్ కు ఇటీవల హైదరాబాద్ లో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనాథ్ కి తల్లిదండ్రులు చిన్న వయసులోనే చనిపోవడంతో ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బందులు పడుతుండగా మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ ని ఆశ్రయించగా గ్రూప్ దాతలు, సభ్యులు అందించిన రూ.53 వేలు చెక్కును బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కో ఆప్షన్ మాజీ సభ్యుడు గనగాని నర్సయ్యల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న,మాజీ ఎంపీటీసీ ముద్దం జయశ్రీ,వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, ఎడ్ల శ్రీనివాస్, మొగుల్లపల్లి సోమయ్య, గాదేనబోయిన నాగరాజు, మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్, కూర్మిళ్ల రాములు, గుంటి దేవా, ఇక్కిరి నాగరాజు పాల్గొన్నారు.




## పది ఫలితాల్లో వి'జయ'కేతనం

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** పదో తరగతి ఫలితాలు జయ పాఠశాల ప్రభంజనం సృష్టించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ లు తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ డి రిత్విక స్టేట్ రెండవ ర్యాంక్ 596 సాధించడంతోపాటు 11 మంది విద్యార్థులు 590 పైన మార్కులు సాధించాలని తెలిపారు 11 మంది 590 ఆపైన 61 మంది 580 143 మంది 570 ఆపైన 238 మంది 560 ఆ పైన 330 మంది 550 586 మంది 500 ఆ పైన మార్కుల తో పాటు హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు విద్యార్థులు 500 ఆ పైన మార్పులు సాధించారని తెలిపారు. దాసరి రిత్విక 596 బోడ ప్రసన్న 595 కట్ట దేవి ప్రియ 594 పోతుగంటి శ్రీ శ్వాస 594 బుడిగ సాన్విక 593 తిప్పన శ్రీజ రెడ్డి 593 కై రోజు హేమంత్ సాయి 592 భూ రెడ్డి హర్షిత 591 కక్కిరేణి ప్రజ్వల 591 నిమ్మల వైశాలి 591 తోవిటి సహస్ర 591 సాధించినట్లు తెలిపారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను కృషి చేసిన అధ్యాపక బృందాన్ని సహకారం అందించిన తల్లిదండ్రులను అభినందించారు.

## వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ముద్ర, మోత్కూర్:** స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే డు ఆధ్వర్యంలో మే 1 నుండి జూన్ 10వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కరాటే మాస్టర్ అన్నపు వెంకట్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుండి 7 గంటల వరకు మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడును. అలాగే సాయంత్రం నాలుగున్నర గంటల నుండి 6 గంటల వరకు గ్యాస్ ఆఫీసు ఎదురుగా వివేకానంద స్కూల్ ఆవరణలో నిర్వహించబడుతుందని ఇట్టి శిక్షణలో ఆరు సంవత్సరముల వయసు నుండి ఎవరైనా నేర్చుకోవచ్చని ముఖ్యంగా అమ్మాయిలు కరాటే జూడో ఆత్మ రక్షణ లాంటి విద్యలు నేర్చుకోవాలని తెలిపారు. ఇట్టి సమ్మర్ క్యాంపులో కరాటే, జూడో, నాంచాక్, జిమ్నాస్టిక్ లాంటి ఆర్ట్స్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గలవారు 99495 36393 నంబర్ ను సంప్రదించాలని అన్నారు.



## బెల్లి లలిత ఆశయాలను సాధించాలి

**ముద్ర, మోత్కూరు:** తెలంగాణ గాన కోకిల, మలిదశ ఉద్యమ నాయకురాలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బెల్లి లలిత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం బెల్లి లలిత 52వ జయంతిని పురస్కరించుకొని మోత్కూరులో ఆమె చిత్రపటానికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, స్థానికులు లాదినేని సోమేశ్వర్, బాబురావు, గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన మేడే వేడుకలు నిర్వహించాలి




**ముద్ర, మోత్కూర్:** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలక వర్గాలకు కనివిప్పు కలిగించేలా గ్రామ గ్రామాన మేడే నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనేక పోరాటల ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులను నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకులు కాలరాస్తున్నారని, ఆ విదానాలకు వ్యతిరేకంగా హక్కుల రక్షణ కోసం కార్మికులు, కర్షకులు సమస్త ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై
# గట్టి నిఘా పెట్టాలి

- యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో అంకార్డ్ (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణ తో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్‌కు సంబంధించిన అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కళాశాలలు మరియు క్రీడా పోటీల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. విద్యార్థులను దుష్ప్రవర్తనల నుండి దూరంగా ఉంచేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, వాటి కార్యకలాపాలను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ కళాశాలల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి, దాని ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.జిల్లా విద్యా అధికారి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలను వివరించాలని ఆదేశించారు. అదే విధంగా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ డ్రగ్స్ సరఫరా, నిల్వ, వినియోగంపై కఠిన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేసి డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీ,ఫ్యాక్టరీ, గ్రామాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు పడకుండా చూడాలన్నారు.ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపర్నెంట్ విష్ణుమూర్తి, డీఈవో సత్యనారాయణ, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ, జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచండి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, ముద్రప్రతినిధి:** ధాన్యం కొనుగోలు వేగంగా జరపాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ అధికారులను ఆదేశించారు. మహబూబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ బుధవారం సీరోలు మండలం ఉప్పరిగూడెం, కాంపల్లి, కురవి మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా సహకార శాఖ 150, ఐకెపి 50, గిరిజన కార్పొరేషన్ 8, మెప్మా 1, శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొత్తం (209) కేంద్రాల నుండి రైతు లు తీసుకువచ్చిన ధాన్యాన్ని సేకరించడం జరుగుతుందని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3934.860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వివరాలను ఆన్లైన్ లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా సంబంధిత సెంటర్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపా రు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ కె అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ సివిల్ సప్లై నరసింహరావు పాల్గొన్నారు.

# ఘనంగా బెల్లి లలితక్క జయంతి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ గానకోకిల బెల్లి లలితక్క 52వ జయంతి వేడుకలు బుధవారం భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద లలితక్క విగ్రహ కమిటీ, బెల్లి లలితక్క కుమారుడు సూర్య ప్రకాష్, జన్ని వెన్నెల, ప్రజా సంఘాల ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా పట్టణంలోని ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, వివిధ సంఘాల నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్ నాయకులు మాట్లాడుతూ విగ్రహాన్ని ఏర్పాటు చేసేవరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, మల్లారెడ్డి, కూర వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కనుకుంట్ల బాబురావు, చిక్కుల వెంకటేశం, శ్రీనివాస్ నేత, తోటకూర వెంకటేష్, తుమ్మేటి పండు యాదవ్, గుర్రాల శ్రీనివాస్, జలిగం విఘ్నేష్, కుతాడి సురేష్,హమీద్, మర్రి పాండు, ర్యాకల రమేష్, గుండెబోయిన సురేష్, హరినాథ్, దండెబోయిన శ్రీశైలం, రాములు, చిన్నం శ్రీనివాస్, గండు బసవయ్య, పర్వతం దశరథ, కాశపాక మహేష్, పాక రాజు, శ్రీరాం మురళికృష్ణ, చిలుకల రమేష్, ఉదరి రామరాజు, కొత్త భారత్, రత్నపురం ప్రవీణ్, రసాల నరసింహ, శ్రీరాం శరత్ యాదవ్, తుమ్మేటి శ్రీశైలం,బాలస్వామి, రసాల నవీన్,బర్రె కరుణాకర్, మేకల ఆంజనేయులు, రాసాల నరసింహ, ఉదయ్,మచ్చగిరి క్రాంతిధల్, ఉదరి బాలరాజు యాదవ్, ఎడుమేకల లక్ష్మణ్, ఏనుగు మల్లారెడ్డి పాల్గొన్నారు.

# ఫ్యూచర్ కనిపించడం లేదు?

- యువతకు ఉపాధి లేదు..
- భూములు కోల్పోయే రైతులకు కూడా అన్యాయమే
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఫ్యూచర్ సిటీ పేరుతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ ఖాన్ పేటలో పోలీస్ కమిషనరేట్ కు శంకుస్థాపన చేసీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే ఫ్యూచర్ సిటీ అని ప్రకటించడం విడ్డూరంగా ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. బుధవారం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో చేసిన శంకుస్థాపనలో ఎంతమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు చెప్పలేదు ఫ్యూచర్ సిటీలో ఎంతమంది రైతులు భూములు కోల్పోతున్నారు చెప్పలేదు ఎంతమందికి ఫ్యూచర్ సిటీలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు స్పష్టత లేదని అన్నారు. ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా పోలీస్ కమిషనరేట్ కు శంకుస్థాపన చేయడం మీద ఉన్న అత్యుత్సాహం ప్రజలకు రైతులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై లేదు అని ప్రజా ఉద్యమాలను బలహీన పరిచి విధానాలు నిరంకుశత్వాన్ని పెంచిపోషించడమే తప్ప మరొకటి కాదన్నారు. బిఆర్ఎస్ నాయకత్వం 25 సంవత్సరాల ఆత్మ అవలోకనంలో తేల్చుకున్నది ఏమిటి అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, బొడ్డుపల్లి వెంకటేష్, ఎండి పాషా, బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, ఎంఏ ఇక్బాల్, మద్దెపురం రాజు, వనం ఉపేందర్, రాచకొండ రాములమ్మ, అవ్వారు రామేశ్వరి, గోషిక కరుణాకర్ పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాల్లో 99.77 ఉత్తీర్ణత

ఎంఈఓ బోయిని లింగయ్య

**ముద్ర, తుంగతుర్తి:** నేడు ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో తుంగతుర్తి మండలంలో 99.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య తెలిపారు, బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షలకు 454 మంది విద్యార్థులు హాజరుకాగా 453 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు, మండల పరిధిలోని గొట్టిపర్తి (94 శాతం) జిల్లా పరిషత్ పాఠశాల మినహా అన్ని పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించారని తెలిపారు, మండలంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన వెలుగు లికిత 569 మార్కులు, ద్వితీయ స్థానం మేరీ మదర్ పాఠశాలకు చెందిన షేక్ యాసిన్ 556 మార్కులు సాధించినట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వం వద్ద కొనుగోలు వేగవంతం చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశపాక మహేష్, రాసాల నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి మండలంలోని హుస్నా బాద్, బస్వాపురం ప్రభుత్వ వద్ద కొనుగోలు ఐకెపి సెంటర్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రసాల బాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

## టెన్త్ లో సెక్రెడ్ హార్ట్ విద్యార్థుల ప్రతిభ

**ముద్ర, మోత్కూర్:** బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సెక్రెడ్ హార్ట్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. 600 మార్కులకు సిహెచ్ 577 మార్కులు సాధించి మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన పి.నిక్షిత జి.దాత్రిజ 575 ద్వితీయ స్థానంలో నిలిచారు. మొత్తం 88 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 88 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై పాఠశాలలో 100% ఉత్తీర్ణులయ్యారు. మండలంలో నే ప్రథమ, ద్వితీయ స్థానం తో పాటు ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ ఎం తానయ్య అభినందించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉంచండి
రక్తపోటు, మధుమేహం గుండెపై ప్రభావం చూపుతాయి. క్రమం తప్పకుండా టెస్టులు చేయించుకోవాలి.





## ప్రజల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటాం : ఎన్‌హెచ్‌ఆర్‌సి నేతలు

- జాతీయ మానవ హక్కుల కమిటీ నూతన కార్యవర్గ సమావేశం



**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**

హక్కుల పరిరక్షణలో ముందుండి పనిచేస్తామని ఎన్‌హెచ్‌ఆర్‌సి నేతలు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జాతీయ మానవ హక్కుల కమిటీ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించి, కొత్తగా నియమితులైన సభ్యులను పరిచయం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య సూచన మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెమలి సుభాష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుడిసె ప్రభు రాజ్ మాట్లాడుతూ, కొత్తగా నియమితులైన సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు న్యాయం అందించడమే తమ ముఖ్య లక్ష్యమని, ప్రతి సామాన్య పౌరుడి హక్కులను కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణలో కమిటీ విధి విధానాలను ప్రజలకు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత చురుకుగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి సభ్యులు జాయింట్ సెక్రటరీ చంద్రం, దానబోయిన శంకర్, సోషల్ ఆర్గనైజర్ శంకర్ పోతురాజు, అధికార సలహాదారు నాగపూజ, సలహాదారులు సంపత్ ఎర్రవెల్లి (అడ్వకేట్), బోయ రాములు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట టౌన్ కమిటీ సభ్యులుగా అధ్యక్షురాలు శ్రీమల సునీత, ఉపాధ్యక్షులు రామ్ గోపాల్ చారి, జాయింట్ సెక్రటరీలు వెంకట్ లక్ష్మి, సుజాత, సోషల్ ఆర్గనైజర్ శివరాజ్, సలహాదారు బాలనర్సు హాజరయ్యారు. చిన్నకోడూరు మండల కమిటీ సభ్యులుగా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి భానుచందర్, జాయింట్ సెక్రటరీ మహంకాళి ఎల్లయ్య పాల్గొన్నారు.

## సిద్ధిపేట జిల్లాలో 97.82 శాతం ఉత్తీర్ణత

- జిల్లా టాపర్ గా బొమ్మిడి అమూల్యా రెడ్డి



**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట :**

పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. మార్చి 14వ తేదీ నుంచి ఈనెల 15వ తేదీ వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాల్లో సిద్దిపేట జిల్లాలో 97.82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. సిద్దిపేట జిల్లా నుంచి 15,325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 7752 మంది బాలురు, 7573 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలు రాసిన వారిలో 7,540 మంది బాలురు 7455 మంది బాలికలు కలిపి మొత్తం 14995 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 97.27శాతం, బాలికలు 98.65శాతం, కలిపి మొత్తం 97.82 శాతం ఉత్తీర్ణత నమోదు అయిందని విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

**-నంగునూరు మండలంలో 99.53 శాతం ఉత్తీర్ణత**

నంగునూరు మండలంలో పదో తరగతి ఫలితాలలో 99.53 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో నంగునూరు మండలం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నంగునూరు మండలం నర్మెట ఉన్నత పాఠశాల విద్యార్థిని బొమ్మిడి అమూల్యా రెడ్డి 587 మార్కులు, రాజగోపాలపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌరాయపల్లి సహస్ర భారతి 581 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. నంగునూరు మండలంలో ఏడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నర్మెట కేజీబీవీలో 97.83 శాతం, రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో బాలురు 193 మంది, బాలికలు 237 మంది కలిపి మొత్తం విద్యార్థులు 430 విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో బాలురు 192, బాలికలు 236 కలిపి మొత్తం 428 మంది ఉత్తీర్ణులు అయ్యారు. మొత్తం మీద ఇద్దరు మాత్రమే అనుత్తీర్ణులు అయ్యారు. అనుతీర్ణులైన వారిలో నర్మెట కేజీబీవీకి చెందిన విద్యార్థిని పరీక్షల సమయంలో అపెండిసైటిస్ శస్త్ర చికిత్స కారణంగా కొన్ని పరీక్షలకు గైర్హాజరు కావడంతో ఉత్తీర్ణత సాధించలేదు. నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 మంది, నంగునూరు ఉన్నత పాఠశాలలో 76 మంది, నర్మెట ఉన్నత పాఠశాలలో 74 మంది, పాలమాకుల ఉన్నత పాఠశాలలో 19 మంది గట్ల మల్యాల ఉన్నత పాఠశాలలో 27 మంది బద్దిపడగ ఉన్నత పాఠశాలలో 21 మంది అంక్షాపూర్ ఉన్నత పాఠశాలలో 19 మంది, అక్కెనపల్లి లోని తెలంగాణ మోడల్ స్కూల్లో 99 మంది విద్యార్థులు పరీక్షలు రాసి అందరూ తీర్ణులయ్యారు. రాజగోపాలపేట ఉన్నత పాఠశాలలో 25 మంది పరీక్షలు రాయగా 24 మంది పాసయ్యారు. నర్మెట లోని కేజీబీవీలో 46 మంది పరీక్షలు రాయగా 45 మంది ఉత్తీర్ణులయ్యారు. నర్మెట ఉన్నత పాఠశాలలో బొమ్మిడి అమూల్య రెడ్డి 587 మార్కులు, రాజగోపాలపేట ఉన్నత పాఠశాలకు చెందిన గౌరాయపల్లి సహస్ర భారతి 581 మార్కులు, గట్లమల్యాల ఉన్నత పాఠశాలకు చెందిన బి.అశ్విని 572 మార్కులు, నంగునూరు ఉన్నత పాఠశాలకు చెందిన గౌరబోయిన వైష్ణవి 567 మార్కులు, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మయోజు సంజన 559 మార్కులు, నర్మెట కేజీబీవీకి ఎండిన ఎం గాయత్రి 558 మార్కులు, అక్కెనపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ కు చెందిన కే వెన్నెల 558 మార్కులు,మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మయోజు సాయి కృప, దేవర అశ్వంత్ లు 556 మార్కులు, పాకాల యశ్వంత్ 555 మార్కులు, ముద్ర బోయిన శివకుమార్ 546 మార్కులు, పాలమాకుల ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.హర్షిత్ 540 మార్కులు, అంక్షాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల 539 మార్కులు. మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన గోక ప్రణీత్ రెడ్డి 538 మార్కులు, జాప ఆర్తి 537 మార్కులు సాధించారు. మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల నుంచి 24 మంది ఎస్.ఎస్.సి. పరీక్షలు రాయగా అందరూ ఉత్తర్ణులు అవడమే కాక వీరిలో 18 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులను గ్రామ సర్పంచ్ పాకాల శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రాజు, మయోజు రాజు, కొలుపుల రమేశ్, జాప పరశు రాములు, అచ్చిన హరికృష్ణ , అమ్ముల ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్, ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, జీడిపల్లి సురేందర్ రెడ్డి, ధీకొండ గోవర్ధన్, ఎం.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెడు సహవాసాలతో జీవితం దుర్భరం

- కలెక్టర్ కె. హైమావతి హెచ్చరిక

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



సైబర్ క్రైమ్ (సైబర్ నేరాలు), సమాచార మాధ్యమాల ద్వారా ఏర్పడుతున్న చెడు స్నేహాల వలలో పడి అనర్థాలకు గురికావద్దని జిల్లా కలెక్టర్ కె. హైమావతి యువతకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ వారం పిల్లల భద్రత, 'నో డ్రగ్స్' ప్రచారం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో "మాకు అన్నీ తెలుసు" అనే భ్రమ ఎక్కువగా ఉంటుందని, నిజంఅబద్ధాన్ని సరిగా గ్రహించకుండా ఆకర్షణలకు లోనవుతారని పేర్కొన్నారు. ఇంటర్నెట్, టెక్నాలజీని అవసరానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రజ్ఞ, విచక్షణతో వాటిని ఎంతవరకు ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. వాట్సాప్ (వాట్సప్), ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా కొత్త పరిచయాలతో స్నేహాలు పెంచుకోవడం వల్ల సమయం, చదువు, జీవితంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. కొన్ని చోట్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయని, వాటికి సోషల్ మీడియా స్నేహాలు కూడా కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వాలని, బయట తక్కువ మంది స్నేహితులు ఉంటే జీవితం ప్రశాంతంగా ఉంటుందని సూచించారు. తల్లిదండ్రులు 20 సంవత్సరాలు కష్టపడి పిల్లలను పెంచి, వారి లక్ష్యాల సాధన కోసం చదివిస్తున్నారని గుర్తు చేశారు. ఆ లక్ష్యాలను సాధించడం ద్వారా వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. ఆధ్యాత్మిక భావన, యోగ, ధ్యానం ద్వారా సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుగా కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, విద్యకు సంబంధించిన సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు చెప్పాలని సూచించారు. కొన్ని సమస్యలకు కాలమే పరిష్కారం చూపుతుందని అన్నారు. చదువు, పరీక్షలు, విధులు, కుటుంబమే విద్యార్థుల ప్రధాన ప్రపంచమని పేర్కొన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధన కోసం నిరంతరం శ్రమిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆకాంక్షించారు. సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు), సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా సంక్షేమ శాఖ, పోలీస్ శాఖలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, సీడీపీఓ రాము, ఇంచార్జి డీఎంహెచ్ఓ, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం హైకోర్టుకు హరీశ్ రావు

- సిద్దిపేట అన్నదాతల కోసం న్యాయ పోరాటం
- రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



రుణమాఫీ చేస్తామని. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మరీ మాట తప్పి, రైతుల నోట్లో మట్టి కొట్టిన రేవంతు సర్కారుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. రుణమాఫీ కాక రైతులు పడుతున్న కష్టాలు, కన్నీళ్లను చూసి చలించిపోయిన హరీశ్ రావు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. అన్యాయానికి గుర్రైన రైతుల కోసం తాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో రుణమాఫీకి అర్హులైన రైతులు 43,363 మంది ఉండగా రుణమాఫీ ప్రయోజనం పొందినవారు 20,514 మంది మాత్రమే. అన్నారు. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య 22,849 మంది ఉందన్నారు. రుణమాఫీ పొందిన రైతుల శాతం 47శాతం మాత్రమే అని అన్నారు.

**మాట తప్పిన రేవంత్ రెడ్డి..**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ఆ పైన ఉన్న అప్పులను రైతులు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని షరతు విధించింది. ఈ మాట నమ్మి, ఎంతోమంది రైతులు అప్పులు చేసి, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి మరీ ఆ అదనపు మొత్తాన్ని చెల్లించారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందని ఆశపడితే, ఇంతవరకు నిధులు విడుదల చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనివల్ల బ్యాంకుల నుండి రైతులపై ఒత్తిడి, వడ్డీల భారం పెరిగిపోయి, రైతులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు.

**హైకోర్టులో హరీష్ రిట్ పిటీషన్..**

నియోజకవర్గంలోని వేలాది మంది రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద గౌరవ హైకోర్టును ఆశ్రయించానని సిద్దిపేట ఎమ్మెల్యే , మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వివరించారు. రైతుల ఖాతాల్లో వెంటనే రుణమాఫీ సొమ్మును జమ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, అర్హులైన 22,849 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమ చేయాలని, బ్యాంకుల నుండి రైతులను కాపాడాలని డిమాండ్ చేసారు. హైకోర్టు ద్వారా తమ రైతులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందనీ విశ్వాసం వ్యక్తం చేశారు.

## 2న సీజ్ చేసిన పిడిఎస్ బియ్యం వేలం

- మెదక్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



మెదక్ జిల్లాలోని 7 ఎంఎల్ఎస్ పాయింట్లలో, రైస్ మిల్లుల్లో కస్టడీలో ఉన్న 6ఏ కేసు కింద సీజైన నిలువ చేసిన పిడిఎస్ బియ్యాన్ని వేలం వేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద తెలిపారు. ఈ నెల 30, మే 1 తేదీలలో వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు చేసుకువాలని సూచించారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మే 2న ఉ.11 గంటలకు అదనపు కలెక్టర్ కార్యాలయంలో టెండర్లు తెరవబడునని పేర్కొన్నారు. చేగుంటలో 201 క్వింటాళ్లు, మెదక్ లో 40 క్వింటాళ్లు, తూప్రాన్ లో 221.10 క్వింటాళ్లు, శంకరంపేట్ (ఆ)లో 485.80 క్వింటాళ్లు, నర్సాపూర్ లో 305.60 క్వింటాళ్లు, పాపన్నపేటలో 86.95 క్వింటాళ్లు, రామాయంపేటలో 27.70 క్వింటాళ్లు, రైస్ మిల్లులో 525.50 క్వింటాళ్లు, మొత్తం 1893.65 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని వేలం వేస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో వేలం నిబంధనలు పాటించి పాల్గొనాలని నిత్యానంద్ తెలిపారు.

# పదిలో మెదక్ జిల్లాకు 22వ స్థానం

- మూడు మండలాల్లో 100శాతం ఉత్తీర్ణత
- మెదక్ కేజీబీవీ, ఘనపూర్ ఎంజేపీ 100శాతం రిజల్ట్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**


576 సుకిత్, ఎంజేపీ హవెలి ఘనపూర్





గంగోత్రి (583)

పదో తరగతి పరీక్షా ఫలితాలలో మెదక్ జిల్లాకు 22వ స్థానం దక్కింది. మొత్తం 11,232 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 10,853 మంది పాసై 96.63% ఉత్తీర్ణత శాతం నమోదైందని జిల్లా ఉద్యాధికారి విజయ తెలిపారు. బాలురు 5,572 మంది పరీక్షలు రాయగా 5,331 మంది 95.67% ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 5,660 మంది పరీక్షలు రాయగా 5,522 మంది 97.56 % ఉత్తీర్ణులయ్యారు. కాగా జిల్లాలో మూడు మండలాల్లో 100% ఉత్తీర్ణత సాధించారు.

**126 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత**

మెదక్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో 227 పాఠశాలల్లో 126 పాఠశాలల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు. బీసీ వెల్ఫేర్ 4, కేజీబీవీ 9, మోడల్ 4, ప్రైవేట్ 25, రెసిడెన్షియల్ 1, రెసిడెన్షియల్ మైనారిటీ 1, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ 2, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ 3, జిల్లా పరిషత్ 77 పాఠశాలలో ఉన్నాయని డీఈఓ విజయ తెలిపారు. జిల్లాలోని అల్లాదుర్గం, నిజాంపేట, వెల్దుర్తి మండలాలలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అత్యల్పంగా నర్సాపూర్‌లో 86.91శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలోని కేజీబీవీలలో 96.81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. హవేలి ఘనపూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంజేపీ బీసీ గురుకులం, కూచన్‌పల్లి హైస్కూళ్లు పదో తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాయి. ఎంజేపీ విద్యార్థి పి.సుకిత్ (576) టాపర్‌గా నిలవగా, ఆ పాఠశాలలో 34 మంది 500 పైగా మార్కులు సాధించారు. విద్యార్థుల అద్భుత ప్రతిభను ఎంఈవో మధుమోహన్, ప్రిన్సిపల్ సృజన అభినందించారు. హవేలి ఘనపూర్ మండలం కూచన్ పల్లి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 100 % ఉత్తీర్ణత సాధించారు. 103 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 103 మంది ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా సింగీతం దివ్య 561 మార్కులు, చింతల రవితేజ 552 మార్కులు, పొద్చన్ పల్లి నందిశ్వర్ గౌడ్ 552 మార్కులు, మంద భవాని 551 మార్కులు సాధించినట్లు హెచ్ఎం మధుమోహన్ తెలిపారు. మెదక్ కేజీబీవీ విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష రాసిన 40 మంది విద్యార్థినులూ పాస్ కాగా.. రుచిత, సంధ్య, గాయత్రి ముగ్గురూ 495 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. స్రవంతి 471 మార్కులు సాధించింది. విద్యార్థినుల విజయం పట్ల ఎస్ఓ కవిత హర్షం వ్యక్తం చేశారు.

**గీత విద్యార్థికి 583 మార్కులు**

మంబోజిపల్లి గీతా విద్యార్థి 583 మార్కులు సాధించింది. పదవ తరగతి ఫలితాల్లో మెదక్, మంభోజిపల్లి, నర్సాపూర్ గీతా విద్యాసంస్థల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. కే. గంగోత్రి 583/600 మార్కులు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను గీతా విద్యాసంస్థల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపల్ మాధవి రామాంజనేయులు అభినందించారు.

## పక్కాగా జనగణన జరగాలి

- సర్వే పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జనగణన పక్కాగా జరగాలని అదనపు కలెక్టర్ నగేష్ సిబ్బందికి సూచించారు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలో జనగణన సర్వే తీరును డోర్ టు డోర్ తిరిగి పరిశీలించారు. జనగణను పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజల నుంచి పూర్తి సమాచారాన్ని రాబట్టాలని, జనగణనలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం ప్రక్రియను పరిశీలించారు. సరిగా తూకం వేయాలని, సజావుగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వెంట స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.04.2026
www.mudranews.in | @mudranews



**బరువు నియంత్రణలో ఉంచండి**

ఊబకాయం గుండె జబ్బులకు ప్రధాన కారణం. సరైన డైట్ + వ్యాయామంతో బరువు తగ్గించాలి.



# విలేఖరులకు మౌలిక వసతులు కల్పించాలి

**- ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రెస్ క్లబ్ లు పనిచేయాలి**

**- ఎంపీ ఈటల రాజేందర్**



**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** ప్రభుత్వం విలేఖరులకు మౌలిక వసతులు కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కు ఎదురుగా అద్దె భవనంలో ఏర్పాటు చేసుకున్న మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ ఆఫీసు ను బుధవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం ప్రెస్ క్లబ్ కు వంద గజాల స్థలాన్ని కేటాయించడానికి మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. కనీసం లీజుకైనా జిల్లా ప్రెస్ క్లబ్ కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ప్రెస్ క్లబ్ అనేది ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేందుకు వేదిక గా ఉపయోగ పడాలని ఆకాంక్షించారు. విలేఖరులు సమాజంలోని సమస్యలను వెలికి తీస్తూ సమాజ అభివృద్ధికి పాటు పడుతున్నారని అన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజక వర్గం బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టరేట్ కు ఎదురుగా జిల్లా ప్రెస్ క్లబ్ ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఇది అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. పత్రికా విలేఖరులు ప్రజల కోసం పని చేసే వారని, కిరాయి భవనంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం జిల్లా ప్రెస్ క్లబ్ కోసం స్థలాన్ని కేటాయిస్తే, నిర్మాణానికి తగిన సహాయం అందిస్తామన్నారు. పత్రికా విలేఖరులు ప్రజల కోసం తమ సేవలను కొనసాగించాలని కోరారు.

**ప్రెస్ క్లబ్ కు స్థలం ఇప్పించేందుకు సహకరిస్తాం..**

కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఆర్ టీఏ కమిటీ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రెస్ క్లబ్ కోసం కలెక్టరేట్ కు పక్కన ఉన్న సర్వే నెంబర్ లో స్థలము ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తలిపారు. స్థలం కేటాయించగానే అందరి సహకారంతో మంచి భవనాన్ని నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు పత్రికలు చదివే అలవాటును కొనసాగించాలని సూచించారు. పత్రికా విలేఖరులు వాస్తవాలను వెలికి తీయాలన్నారు.

జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బి. నర్సింహులు యా దవ్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ను ప్రజలకు అందుబాటులో ఏర్పా టు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వినోద్ కుమార్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, టీయూడబ్లుయూ హెచ్. 143 జిల్లా అధ్యక్షుడు కోలా వెంకటే శ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, డీపీఆర్ఓ స్వర్ణలత, ఐఅండ్ పీఆర్ డిప్యూటీ ఇంజినీర్ నాగాంజలి, టీయూడబ్ల్యూజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీ. మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి చంద్ర, పాక రవీందర్, మీడియా అక్రెడిటేషన్ కమి టీ మెంబర్ .రామారావు, జిల్లా ప్రెస్ కమిటీ ఆఫీస్ బేరర్స్ రవికిరణ్ రెడ్డి, కృష్ణ, బాల్ రెడ్డి, పండుగ రామకృష్ణ, రచ్చ శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి కె. ప్రసాద్, శామీర్ పేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవి, సభ్యులు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## అకాల వర్షంతో తీవ్ర నష్టం

**ముద్ర ప్రతినిధి , నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం ప్రజలను, ముఖ్యంగా రైతులను తీవ్రంగా కలవరపరిచింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసి పలు ప్రాంతాల్లో నష్టం వాటిల్లింది. వంగూర్ మండలం చాకలి గుడిసెలు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పసుపులేటి మణెమ్మ (45) అనే మహిళ పొలం నుంచి ఇంటికి వస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బిజినేపల్లి మండలం పోలే పల్లి పరిధిలోని నెలగడ్డ తండాలో పిడుగు పాటుకు రైతు బాల్యకు చెందిన రెండు కాడె ద్దులు మృతి చెందాయి. ఈ ఘటనలో సుమా రు రూ.2 లక్షల మేర నష్టం వాటి ల్లినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

# గింజ కొంటే ఒట్టు...!

**- కల్లాల్లోనే రైతుల ధాన్యం**

**- ఇప్పటివరకు ధాన్యపు గింజ కొనని కాంగ్రెస్ సర్కార్**

**- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** కాంగ్రెస్ సర్కార్ హయాంలో రైతులు గోసపడుతున్నారు... అష్ట కష్టాలు పడి ధాన్యం పండిస్తే అమ్ముకోడానికి నానా తంటాలు పడుతున్నారు ...ప్రస్తుతం రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది..రైతులు పండించిన ధాన్యం కల్లాలకే పరిమితం అయిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని తన నివాసం లో నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం మాట్లాడారు. పదిహేను రోజుల నుంచి కేంద్రాలకు వడ్లు తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క గింజ కొన్న పాపాన పోలేదన్నారు. రైతులు ఎవరి పొలం వద్ద వాళ్ళు వడ్లు ఎండ బెట్టి గతంలో ఏ మిల్లు లో వేయాలని అధికారులు రాసి ఇస్తే ఆ మిల్లులకు స్వయంగా రైతులు ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లేవారన్నారు.కానీ ఇప్పుడు కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి అమ్మకం చేయాలనీ చెప్పడం చూస్తే రైతులను ప్రభుత్వం ఎంత ఇబ్బంది పెడుతుందో అర్థమవుతున్నదన్నారు. 500 బస్తాలు నింపి లారీలను మిల్లులకు పంపించాలనే నిబంధన తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండేళ్ల తరువాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, అప్పుడు రైతుల ను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కేసీఆర్ ఉన్న సమయంలో సమ యానికి రైతు బంధు.. కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు సేవార న్నారు. గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్,పార్టీ పట్ట ణ అధ్యక్షులు శివరాజ్, మాజీ ఎంపీపీ బాల రాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ముష్కిన్ చెరువులో నిర్మాణాలు వద్దు

**- 10 రోజులు గడువిచ్చిన హైడ్రా అధికారులు**

**- తాత్కాలిక షెడ్డుల్లో ఉన్నవారితో నేరుగా చెప్పిన హైడ్రా**

**- ఎఫ్టీఎల్ పరిధిని పరిరక్షించేందుకు హైడ్రా చర్యలు**



**ముద్ర, హైదరాబాద్:** " మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్ టీ ఎల్ (ఫుల్ ట్యాంక్) పరిధిలో ఉన్నారు. ఇక్కడ తాత్కాలిక షెడ్డుల్లో ఉంటున్నారు.. మిమ్ముల ను పావులుగా వాడుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి పోసి.. చెరువు స్వరూపాన్ని మార్చేసి బడా నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. ఇక్కడే చెత్తను వేరు చేసి వ్యర్థాలను చెరువు లోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువు కలుషితమౌతోంది. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి.. వారి ఆక్రమణలను తొలగించకుండా అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మీరంతా ఖాళీ చేస్తే. చెరువును అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. ఇక్కడ చెరువు అభివృద్ధి పనులు చేసేవారికి ఆటంకాలు కల్పించవద్దు " అని రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, నార్సింగ్ విలేజ్‌కు దగ్గ ర్లోని ముష్కిన్ చెరువో ఎఫ్టీఎల్ పరిధిలో తాత్కాలిక షెడ్డుల్లో ఉన్న వారికి హైడ్రా అధికారులు బుధవారం చెప్పారు. మీకు 10 రోజులు సమయం ఇస్తున్నాం.. ప్రత్యామ్నాయం చూసుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య , హైడ్రా ఏసీపీ శ్రీ తిరుమల్ , ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీమతి రమాదేవి తో పాటు.. పలువురు హైడ్రా అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ అదికారులు అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకుని నివాసముంటున్న వారితో మాట్లాడారు.పేదలను, అమాయకులను అడ్డం పెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని కూడా హెచ్చరించారు. ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని హెచ్చరించినా పట్టని ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్..**

చుట్టూ వేలాది నివాసాలు.. లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. చెరువును ఆక్రమించి నిర్మాణ వ్యర్థాలతో నింపేసి.. తాత్కాలిక షెడ్డులతో కబ్జా చేయాలనుకునే వారి కుట్రలను అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. చెరువు చెంతనే చెత్తను వేరు చేసే యూనిట్లకు అద్దెకు ఇచ్చి.. ముష్కిన్ చెరువును మురికి కూపంగా మార్చడాన్ని సీరియస్గా పరిగణించింది. బడాబాబుల కబ్జాలకు కార్మికులు, సామాన్యులు బలి కావద్దు.. అంటూ విజ్ఞప్తి చేసింది. హెచ్ ఎం డీ ఏ నిర్ధారించిన మేరకు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమ దంటూ వాధిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు.. మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ ఎం డీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది. ఇక బఫర్తో కలిపితే ముష్కి చెరువు 62 ఎకరాల వరకూ ఉంటుంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చేశారు కూడా. అయినా పట్టించుకోకుండా.. చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమౌతోంది.

**స్థానికుల హర్షం..**

సకల జీవకోటికీ ప్రాణాధారమైన చెరువును కాపాడుతున్న హైడ్రాకు ధన్యవాదాలు. చెరువు కబ్జాలపాలౌతోందని ఫొటోలు, సాక్ష్యాలతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. మట్టి నింపుతున్న వైనాన్ని వీడియోను చూపించాం. వెంటనే హైడ్రా అధికారులు వచ్చి పరిశీలించారు. చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో బండ్ నిర్మాణం చేపడితే అడ్డుకున్నారు. ఇప్పుడు 52 ఎకరాల మేర చెరువు అభివృద్ధి జరగడానికి చర్యలు తీసుకున్నారు. హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదట కాంగ్రెస్ నాయకుల ధర్నా




**ముద్ర, కాప్రా:** కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదట బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ముఖ్యమంత్రి ఫోటోను కార్యాలయంలో ప్రదర్శించకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రోటోకాల్ పాటించకుండా, ముఖ్యమంత్రి , రెవెన్యూ శాఖ మంత్రి ఫొటోలు ప్రదర్శించకపోవడంపై నాయకులు అసహనం వ్యక్తం చేశారు. "ఇది ప్రభుత్వ కార్యాలయమా? లేక బీఆర్ ఎస్ పార్టీ అడ్డా?" అంటూ విమర్శించారు. ఇటీవల కల్యాణ లక్ష్మి పథకం కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా కూడా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఆరోపించారు. అధికారిక కార్యక్రమాల్లో పాటించాల్సిన నియమావళిని పక్కన పెట్టడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించిన కాప్రా తహసీల్దార్ పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా కొంతసేపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ధర్నాలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పత్తి కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ కలెక్షన్ ఆవిష్కరించిన రాయల్ ఎన్‌ఫీల్డ్

**ముద్ర, ఢిల్లీ:** రాయల్ ఎన్‌ఫీల్డ్ బుధవానం తన హెరిటేజ్ కలెక్షన్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఒక ప్రీమియం లైఫ్‌స్టైల్ దుస్తుల శ్రేణి కాగా, ఇది బ్రాండ్ 125 ఏళ్ల చరిత్రను ఆధునిక వార్డ్‌రోబ్‌లోకి తీసుకువస్తుంది. కంపెనీ మోటార్‌సైక్లింగ్, మూలాల నుంచి ప్రేరణ పొందిన ఈ కలెక్షన్, ఆర్కైవల్ లోగోలు, జాగ్రత్తగా ఎంపిక చేసిన ఫ్యాబ్రిక్‌లు, బహుముఖ సిల్హౌట్‌లను మిళితం చేసి, మన్నికైన, ప్రస్తుత కాలానికి సరిపోయే దుస్తులను ఉత్పత్తి చేసి అందిస్తుంది. నగరం కోసం నిర్మించబడి, చరిత్రలో పాతుకుపోయిన హెరిటేజ్ కలెక్షన్, రాయల్ ఎన్‌ఫీల్డ్ నైపుణ్యం, ప్రయోజనం, ఆలోచనాత్మకమైన డిజైన్ తత్వాలను ప్రతిబింబిస్తుంది. మన్నిక, ఆకృతి, కదలిక కోసం కాటన్ ట్విల్స్, కాన్వాస్ మిశ్రమాలు, సాగే గుణం ఉన్న మెటీరియల్స్‌ను ఎంపిక చేశారు. తద్వారా ఈ దుస్తులు ఆధునిక పట్టణ జీవితానికి అనువుగా ఉంటూనే, బ్రాండ్ ఆచరణాత్మక స్ఫూర్తికి కట్టుబడి ఉంటాయి. సిల్హౌట్‌లు రిలాక్డ్స్ నుంచి మరింత నిర్మాణాత్మక రూపాల వరకు ఉంటాయి. ఇవి కదలిక స్వేచ్ఛను దృశ్య నిష్పత్తితో సమతుల్యం చేస్తూ, ఒక శతాబ్దపు యాంత్రిక కచ్చితత్వాన్ని రోజువారీ దుస్తులుగా మార్చుతాయి.

## కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ కలెక్టరేట్ ఎదుట సారంగాపూర్ మండలానికి చెందిన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సారంగాపూర్ మండలం ఆలూరు కు చెందిన గజ్జల శ్రీధర్ తన భూమికి సంబంధించిన సమస్య పరి ష్కారం కాకపోవటంతో పురుగుల మందు డబ్బా తో వచ్చి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఐతే అక్కడ ఉన్న జనం డబ్బా లాక్కున్నారు. వెంటనే అధికారులు స్పందించి అంబులెన్స్ కు ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు.

## ఇదెక్కడి కథ

**- కత్తేమో వానికిచ్చి యుద్ధం నన్ను చేయమంటున్నవ్..**

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**ముద్ర డెస్క్:** అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు. ఎన్నికలు రాగానే ప్రజలు అయోమయానికి గురికావొద్దు. గందరగోళంలో ఓటేస్తే ఆగం అవుతారని కేసీఆర్ చెప్పారు. అధికారం రావడం పోవడం రోటీన్‌గా జరిగేదే. పాలమూరు బిడ్డను, ప్రజల గోస తీరుస్తానని రేవంత్ చెప్పారు. రెండున్నరేళ్లు అయిపోయింది ఒక్కసారి ప్రజలు ఆలోచించండని సూచించారు. కొట్లాడాలి కొట్టాడాలి.. అంటే నువ్వు కత్తేమో వానికిచ్చినవ్.. యుద్ధం నన్ను చేయమంటున్నవ్.. ఇదెక్కడి కథ అనిపిస్తదా..? అనిపియ్యదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గెలిపించిన కసిరెడ్డి నారాయణ ఏం చేస్తుండు... రెండో స్థానంలో వచ్చిన ఆచారి ఏం చేస్తుండు. ఇటు కేంద్రప్రభుత్వం అటు రాష్ట్రప్రభుత్వం ఉంది కదా.. మరి మీరు కూడా మమ్మల్ని వద్దనుకుంటిరి కదా..కొన్నికానీ చూద్దామని మనుకు కూడా అనిపి య్యాలే కదా... కొత్తగా అధికారం వచ్చింది కదా వాళ్లు.. మనమెందుకు ఆతృత పడ్డట్టు, కంగారు పడ్డట్లు.. వాళ్లకు అధికారమొస్తే మనం జీర్ణించుకోలేకపోతున్నట్టు ఆగమాగమైపోతున్నట్టు మనమెందుకుండాలే. తెలిసి రానీ అని మాకు కూడా అనిపించందన్నారు. అందులో తప్పేముంది. నిజంగా రైతు బంధు మంచిగా పడుతుంటే అర్థం కేటీఆర్ . రైతు బంధు మంచిగ పడుతుంటే ఎవరుంటే ఏంది తీయ్ అనుకున్నారు. ఐదెకరాల పొలముంటే కేసీఆర్ రాకముందు మొత్తానికి ఎకరానికి రూ.20 లక్షలుండేది మొత్తం కోటి రూపాయలు.. కానీ కేసీఆర్ వచ్చినంక ఆ కోటి రూపాయల విలువ 5 కోట్లు అయింది. అంటే సంపద పెరిగినంక మనిషిలో ధీమా పెరుగుతది. దేశమంతటా గత్తర వచ్చినట్టు వచ్చిందికరోనా. మూతికి బట్టలు కట్టుకుని ఇంట్లోకెళ్లి ఎవరూ బయటకు వెళ్లలేని పరిస్తితి వచ్చింది. అప్పుడేం అనిపిస్తది మనిషికి.

ఎక్కడో ఒకదగ్గర ఆలోచన వస్తది. అయ్యో నేను చచ్చిపోతే నా పెళ్లాం పిల్లల పరిస్థితి ఏంటి.. తల్లిదండ్రుల పరిస్థితి ఏంది.. వాళ్లను ఎవడు చూసుకుండడు.. ఏమైతనే భయం ప్రతీఒక్కరిలో ఉంటది.. నాకే మన్నా అయితే ఎట్లా..అని ఉంటుంది.రూ.5 కోట్ల విలువ ఉంటే ఒక ధీమా ఉంటది.. నాకేమైనా అయినా మావోళ్లు ఎలాగైన బతుకతరు అనిపిస్తదని అన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.04.2026
www.mudranews.in | @mudranews



**కుటుంబ హిస్టరీ ఉంటే జాగ్రత్త**

ఫ్యామిలీలో గుండె జబ్బులు ఉంటే ముందుగానే టెస్టులు చేయాలి.వార్షిక ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి.




## రాష్ట్ర ప్రభుత్వ స్వాధీనంలోకి

# హైదరాబాద్ మెట్రో రైలు

*** ఎల్ అండ్ టీతో ఒప్పందం...**

*** రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ**

*** మెరుగ్గా మెట్రో విస్తరణ పనులు, ప్లాన్, సేవలు**



**ముద్ర , హైదరాబాద్:** ఇప్పటి వరకు ఎల్అండ్ టీ ఆధీనంలో ఉన్న మెట్రో రైలును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–ఇను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీతో కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎంఆర్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఎంఆర్ ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ, ఎల్&టి, ఎల్టిఎమ్ఆర్హెచ్ఎల్ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో లార్సెన్ & టూబ్రో లిమిటెడ్, L&T మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం (షేర్ పర్చేజ్ అగ్రిమెంట్) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్టిఎమ్ఆర్హెచ్ఎల్కు ఉన్న వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై HMRL కంపెనీ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, L&T Ltd తరఫున డి.కె.సేన్, ఎల్టిఎమ్ఆర్హెచ్ఎల్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో ఎల్టిఎమ్ఆర్హెచ్ఎల్ పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్గా IDBI క్యాపిటల్ వ్యవహరించింది, లీగల్ అడ్వైజరీ సేవలను సరాఫ్ & పార్ట్నర్స్ సంస్థ అందించింది.

*** ప్రయాణికులకు అనుకూలంగా....**

హైదరాబాద్లో L&T మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ సంస్థ 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 నెట్వర్క్తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–ఇను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–ఇను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్–I, ప్రతిపాదిత ఫేజ్–II నెట్వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అందజేతలో సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

*** ముఖ్యమంత్రితో ఎల్ అండ్ టీ చైర్మన్ భేటీ...**

ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ చైర్మన్, ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి.

# టీవీకే విజయ్ రెంటికి చెడ్డ రేవడి



ముద్ర న్యూస్ : ఎన్నికలు ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ను చాలామంది పల్లి బఠాణీ టైపు అనుకుంటారు. కానీ అందులో నూటికి నూరు శాతం వాస్తవం లేకపోయినప్పటికీ.. కనీసం 70% వరకైనా నిజం ఉంటుంది. ఎందుకంటే, ఎగ్జిట్ పోల్స్ మొత్తం ఫలితాలను ప్రతిబింబించకపోయినప్పటికీ.. ఎంతోకొంత వాస్తవాన్ని మాత్రం బయట పెడతాయి.. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వెల్లడించాయి. ఇందులో ఆసక్తికరంగా ఉన్నది టీవీ కే విజయ్ భవితవ్యం..

విజయ్ కి గతంలోని పెళ్లయింది. ఇతడు తన మహిళా అభిమానిని పెళ్లి చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత ఆమెతో మనస్పర్థలు వచ్చి దూరంగా ఉంటున్నాడు. విజయ్ కి ఓ కుమారుడు, కుమార్తె సంతానం.. భార్యతో దూరంగా ఉంటున్న విజయ్.. ఓ సినీ నటితో సంబంధాలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఎన్నికలకు ముందే పెద్ద ఎత్తున దుమారం ఏర్పడింది. పైగా దానిని నిజం చేస్తూ విజయ్, ఆ సినీ నటితో ఓ వివాహ వేడుకకు జంటగా హాజరయ్యాడు. పైగా తన భార్యకు విడాకుల సెటిల్మెంట్ కింద కొంతమేర ఆస్తి ఇచ్చేందుకు విజయ్ సుముఖంగా ఉన్నట్టు వార్తలు వచ్చాయి. అయితే విజయ్ భార్య దానికి ఒప్పుకోలేదని సమాచారం.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ఒంటరిగానే పోటీ చేశారు. ఎగ్జిట్ పోల్స్ లో విజయ్ కి యాక్సిస్ మై ఇండియా మినహా మిగతా ఏ సంస్థ కూడా అనుకూలంగా ఫలితాన్ని ప్రకటించలేదు. యాక్సిస్ మై ఇండియా విజయ్ విషయంలో సానుకూలంగా స్పందించింది. అతని ఆధ్వర్యంలో టీవీకే పార్టీ 98 నుంచి 120 స్థానాలు సాధిస్తుందని తెలిపింది. ఇక మిగతా సంస్థలు ఏవీ కూడా టీవీకేకు అధికారం వస్తాయని చెప్పలేదు. కాకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటును టీవీకే పార్టీ చీల్చిందని.. అందువల్లే ఏఐడీఎం కే ఈసారి కూడా అధికారానికి దూరంగా ఉండి పోవాల్సి ఉంటుందని ప్రకటించాయి.

ఎన్నికల ప్రచారంలో టీవీ కె విజయ్ అనేక వివాదాలు ఎదుర్కొన్నారు. ఆయన నిర్వహించిన ఓ సభలో భారీ ఎత్తున ప్రాణ నష్టం చోటుచేసుకుంది. దీన్ని మర్చిపోకముందే భార్య వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత జన నాయగన్ సినిమా విడుదల్లో కూడా జాప్యం ఏర్పడుతోంది. ఇన్ని అవరోధాల మధ్య విజయ్ అధికారంలోకి వస్తారు అనుకుంటే.. అది కూడా నెరవేరని పరిస్థితి.. రెండిళ్ల పూజారిగా మారిన విజయ్.. చివరికి రెంటికి చెడ్డ రేవడిగా మారిపోయారు. ఇప్పటికే సినిమాలకు వీడ్కోలు పలికిన.. కుటుంబ పరంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# నాక్కొంచెం తిక్కుంది.. దానికో లెక్కుంది..

**ఇరాన్పై ట్రంప్ 'మాస్' వార్నింగ్..**

## NO MORE MR. NICE GUY!



అమెరికా రాజకీయాల్లోనే కాదు.. ప్రపంచ వేదికపై కూడా తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించే డొనాల్డ్ ట్రంప్.. మరోసారి వార్తల్లో నిలిచారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో ఇరాన్ను ఉద్దేశించి ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా తన సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన ఒక పోస్ట్ అగ్రరాజ్యం భవిష్యత్ వ్యూహాలకు అద్దం పడుతోంది.

**అణు చర్చలపై అసహనం.. దౌత్యం విఫలమైతే కఠినమే!**

గత కొంతకాలంగా ఇరాన్ అణు కార్యక్రమంపై జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. దీనిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ట్రంప్, ఇరాన్ తీరును తప్పుబట్టారు. అణు ఒప్పందం విషయంలో ఆ దేశానికి స్పష్టమైన అవగాహన లేదని.. వారు కేవలం సమయాన్ని వృధా చేస్తున్నారని విమర్శించారు. "ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే వారికే మంచిది. ఒకవేళ చర్చల ద్వారా పరిష్కారం లభించకపోతే.. అమెరికా కఠిన వైఖరిని అవలంబించడానికి ఏమాత్రం వెనుకాడదు. ఇకపై పరిస్థితులు వారి చేతుల్లో ఉండవు." అని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్ పట్ల అమెరికా అనుసరించబోయే "జీరో టాలరెన్స్" పాలసీని సూచిస్తున్నాయి.

**సంచలనం సృష్టించిన సోషల్ మీడియా పోస్ట్**

కేవలం మాటలతోనే కాకుండా తన సోషల్ మీడియా ప్లాట్ఫారమ్ 'ట్రూత్ సోషల్' లో ట్రంప్ షేర్ చేసిన ఒక ఫోటో ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచింది. చేతిలో రైఫిల్ పట్టుకుని ఉన్న ఫోటోను పోస్ట్ చేస్తూ.. “ఇక మీదట నేను అంత మంచివాడిగా ఉండను” అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్ట్ వెనుక ఉన్న అంతరార్థాన్ని రాజకీయ విశ్లేషకులు రకరకాలుగా విశ్లేషిస్తున్నారు. దౌత్యం విఫలమైతే సైనిక బలప్రయోగానికి కూడా సిద్ధమనే హెచ్చరిక ఇది.మునుపటి కంటే మరింత కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంది. చర్చల టేబుల్ వద్ద ఇరాన్ను లొంగదీసుకునేందుకు చేస్తున్న మైండ్ గేమ్ ఇది.

**పశ్చిమాసియా భద్రతపై ప్రభావం**

ఇజ్రాయెల్–హమాస్, ఇజ్రాయెల్–హిజ్బుల్లా ఘర్షణలతో ఇప్పటికే పశ్చిమాసియా అతలాకుతలమవుతోంది. ఇరాన్ నేరుగా ఈ ఘర్షణల్లోకి ప్రవేశించే ప్రమాదం ఉందన్న ఆందోళనల మధ్య ట్రంప్ హెచ్చరికలు మంటల్లో ఆజ్యం పోసినట్లు అయ్యాయి. అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరిస్తే అది కేవలం ఆ రెండు దేశాల మధ్య సమస్యగానే కాకుండా ప్రపంచ ముడిచమురు సరఫరా, అంతర్జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

**అంతర్జాతీయ సమాజం చూపు.. ఇరాన్ వైపు!**

ట్రంప్ విసిరిన ఈ సవాల్కు ఇరాన్ ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు అత్యంత కీలకం. ఒకవేళ ఇరాన్ మెట్టు దిగి చర్చలకు అంగీకరిస్తే కొంతవరకు ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇరాన్ కూడా తన పంతాన్ని వీడకపోతే మాత్రం అగ్రరాజ్యంతో నేరుగా ఘర్షణ తప్పకపోవచ్చు.

"నాక్కొంచెం తిక్కుంది.. దానికో లెక్కుంది" అన్న చందంగా ట్రంప్ తనదైన శైలిలో ఇరాన్కు అల్టిమేటం జారీ చేశారు. దౌత్యం ద్వారా సాధ్యం కానిది, తనదైన దూకుడుతో సాధించాలన్నది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. మరి ఈ 'మాస్ వార్నింగ్' తర్వాత ఇరాన్ తన అణు వైఖరిని మార్చుకుంటుందో లేదో వేచి చూడాలి.

# సీనియర్ కాంగ్రెస్ నేత నర్సింహారెడ్డి కన్నుమూత



**ముద్ర న్యూస్ బ్యూరో**

**మొయినాబాద్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్, కాంగ్రెస్ నాయకులు గోవిందు నర్సింహారెడ్డి బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయన అంత్యక్రియలు గురువారం ఉదయం జరుగుతాయి. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. సర్పంచ్ గా ఆయన గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. తుది శ్వాస వరకూ ఆయన సంఘ సేవకుడిగా గ్రామానికి సేవలందించారు. ధార్మికవేత్తగా గ్రామంలోని అన్ని ఆలయాల ట్రస్ట్ సభ్యుడుగా ఉంటూ వాటి అభివృద్ధికి తన వంతు సేవలందించారు. నర్సింహారెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల శాసన సభ్యుడు కాలె యాదయ్య, కనకమామిడి గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంతిరెడ్డి గారి గణేష్ రెడ్డి, గ్రామ వార్డు కమిటీ సభ్యులు, వివిధ ఆలయాల ట్రస్ట్ సభ్యులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఉపాధ్యక్షుడు వై నరేందర్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# పసుపు జెండా పౌరుషం ఎప్పుడూ తగ్గలేదు

**తెదేపా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో**

**సీఎం చంద్రబాబు**

**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేష్ ప్రమాణం**

**వైకాపా సినిమాకు ఎండ్ కార్డ్ వేసేది పసుపు సైన్యమే: లోకేశ్**

**బలమైన క్యాడర్తో టీడీపీకి కొత్త ఉత్సాహం**

**వచ్చే ఎన్నికల్లో మరింత ఓట్ల లక్ష్యం**

**వైకాపా పాలనపై లోకేశ్ విమర్శలు..కార్యకర్తలకే కీర్తి**


**అభివృద్ధి అజెండాతో ముందుకు టీడీపీ, క్షేత్రస్థాయిలో దృష్టి**



**ముద్ర, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగు దేశం పార్టీ (టీడీపీ) శక్తి, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.తెదేపా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడిన చంద్రబాబు, పార్టీకి ఉన్న బలమైన క్యాడర్నే తమ ప్రధాన శక్తిగా పేర్కొన్నారు. ఒక్క ఓటమితోనే కొంతమంది పార్టీలు కుంగిపోతున్నా, గెలిచినా ఓడినా సగర్వంగా ఎగిరే జెండా పసుపు జెండా అని ఆయన అన్నారు. 44 ఏళ్ల పార్టీ ప్రయాణంలో అనేక సంక్షోభాలు ఎదురైనా, టీడీపీ పౌరుషం ఎప్పుడూ తగ్గలేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరింత ఓట్లను సాధించాలని కార్యకర్తలకు పోటీ.

పార్టీ నిర్మాణంపై కూడా ఆయన వివరించారు. సీనియర్లకు గౌరవం ఇస్తూనే కొత్తవారికి అవకాశాలు కల్పిస్తామని, కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యత ఇచ్చి దాదాపు 250 మందితో కమిటీ ఏర్పాటు చేశామని. కార్యకర్తే అధినేత అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించామని చెప్పారు.



ఇక మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో నారా లోకేశ్, వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. కార్యకర్తల కృషి వల్లే పార్టీ ఈ స్థాయికి చేరుకుందని, వారి సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశామని.

తెలుగు జాతికి గౌరవం అందించిన వ్యక్తి ఎన్టీ రామారావు అని, ప్రపంచ పటంలో తెలుగువారిని నిలబెట్టిన నాయకుడు చంద్రబాబు అని లోకేశ్ పేర్కొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా బాధ్యతలు మరింత పెరిగాయని, యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు.

వైసీపీ పాలనను “విధ్వంసం సినిమా”గా, టీడీపీని “అభివృద్ధి సినిమా”గా అభివర్ణించిన లోకేశ్, ఆ పార్టీకి ఎండ్ కార్డ్ వేయేది పసుపు సైన్యమే అని. అహంకారం పెరిగితే ఏమవుతుందో 2024 ఎన్నికల్లో కనిపించిందని, వైసీపీ నేతల ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

మొత్తంగా, టీడీపీ నాయకత్వం పార్టీ బలం, క్షేత్రస్థాయి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని, కార్యకర్తలే పార్టీకి మూలస్తంభమని స్పష్టం చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.04.2026
www.mudranews.in | @mudranews



**శరీరం ఇచ్చే సంకేతాలను గమనించండి**

ఛాతీ నొప్పి, శ్వాసలో ఇబ్బంది, అలసటను నిర్లక్ష్యం చేయొద్దు. తక్షణం డాక్టర్‌ను సంప్రదించడం ప్రాణాలను కాపాడుతుంది.





## కాంబ్లీ యాడ్‌పై వివాదం

**ముంబై, ఏప్రిల్ 29 :** మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ నటించిన కొత్త ఐస్‌క్రీమ్ ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అనారోగ్య సమస్యల తర్వాత ఆయన మళ్లీ ప్రజల ముందుకు రావడం ఒక వైపు అభినందనలు పొందుతుండగా, ఆ యాడ్ కాన్సెప్ట్‌పై మాత్రం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రకటనను డిన్‌షాస్ ఐస్‌క్రీమ్ కోసం రూపొందించారు. "జీవితంలో తక్కువ పొందిన వారు, ఎక్కువకు అర్హులు" అనే భావనతో ఈ యాడ్‌ను రూపొందించగా, ఐస్‌క్రీమ్ కోన్‌లో చాక్లెట్ భాగాన్ని ఎక్కువగా చూపించడం ద్వారా సందేశాన్ని ఇవ్వడానికి ప్రయత్నించారు. కాంబ్లీ జీవితంలోని ఎత్తుపల్లాలను ప్రతిబింబిస్తూ, చివర్లో ఆనందాన్ని చూపించేలా కథనం రూపొందించారు. ప్రకటన సంస్థ మాత్రం ఇది కాంబ్లీ పట్టుదల, తిరిగి లేచే ధైర్యాన్ని చూపించే పాజిటివ్ క్యాంపెయిన్ అని చెబుతోంది. అయితే నెటిజన్లు మాత్రం భిన్నంగా స్పందిస్తున్నారు. కాంబ్లీ అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు వంటి వ్యక్తిగత సమస్యలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరైనదా అని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది ఈ యాడ్‌ను "సానుభూతి మార్కెటింగ్"గా విమర్శిస్తుండగా, మరికొందరు కాంబ్లీకి మద్దతుగా నిలుస్తున్నారు. ఆయన మళ్లీ కెమెరా ముందుకు రావడం సంతోషకరమని, దీన్ని నెగెటివ్‌గా చూడకూడదని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఈ ప్రకటన సోషల్ మీడియాలో చర్చకు దారి తీసి, సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాన్ని ప్రకటనల్లో ఉపయోగించే విధానంపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.




## సల్మాన్‌కు ఫెరీరా 'సారీ'

**ముల్లాన్‌పూర్, ఏప్రిల్ 29 :** రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్‌లో తమ జోరు కొనసాగిస్తూ పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఈ సీజన్‌లో పంజాబ్‌కు తొలి ఓటమిని మిగిల్చింది. ఈ విజయానికి దక్షిణాఫ్రికా ఆటగాడు డోనోవన్ ఫెరీరా ప్రధాన కారణంగా నిలిచాడు. కేవలం 26 బంతుల్లో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన అతడు జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు. మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ పోస్ట్ చేసిన వీడియో ఆసక్తికరంగా మారింది. అందులో ఫెరీరా బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్కు సరదాగా క్షమాపణలు చెబుతూ కనిపించాడు. ఇది 2014లో చేసిన ఒక ట్వీట్‌కు సంబంధించిన రిఫరెన్స్. అప్పట్లో పంజాబ్ జట్టు గురించి "జింటా టీమ్ గెలిచిందా?" అంటూ సల్మాన్ చేసిన ట్వీట్ ప్రతి మ్యాచ్ సమయంలో వైరల్ అవుతూ ఉంటుంది. అదే విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఫెరీరా "సారీ భాయ్.. ఈరోజు కాదు" అంటూ నవ్వుతూ స్పందించాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటోంది. మ్యాచ్ విజయం మాత్రమే కాకుండా, ఇలాంటి సరదా క్షణాలు కూడా అభిమానులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తున్నాయి.

## వైభవ్‌పై అర్ష్‌దీప్ సరదా కామెంట్స్



**ముల్లాన్‌పూర్, ఏప్రిల్ 29 :** పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌పై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. కేవలం 16 బంతుల్లోనే 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు మెరుపు ఆరంభం ఇచ్చాడు. ముఖ్యంగా అర్ష్‌దీప్ వేసిన ఓవర్‌లో భారీ షాట్లు కొట్టి మ్యాచ్ మూడ్ మార్చేశాడు. మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ షేర్ చేసిన వీడియోలో అర్ష్‌దీప్ సరదాగా స్పందించాడు. "వైభవ్ బయట 'భయ్యా భయ్యా' అంటూ చాలా గౌరవంగా మాట్లాడుతాడు. కానీ క్రీజులోకి వచ్చాక ఆ మర్యాద పక్కన పెట్టి బాదేశాడు. నా ఓవర్‌లో 35 పరుగులు కొట్టాడు" అంటూ నవ్వుతూ చెప్పాడు. ఇదే సమయంలో యశస్వి జైస్వాల్ కూడా వైభవ్‌ను ప్రశంసించాడు. "అతనితో కలిసి బ్యాటింగ్ చేయడం అద్భుత అనుభవం. బంతిని హిట్ చేసే తీరు చూసి ఆశ్చర్యంగా ఉంటుంది. అతనిలో ఉన్న టాలెంట్ అసాధారణం" అని వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌తో వైభవ్ సూర్యవంశీ యువ సెన్సేషన్‌గా మారిపోగా, అతని ఆటతీరుపై ప్రత్యర్థి ఆటగాళ్లే ప్రశంసలు కురిపించడం విశేషం.

# ముంబైకి డూ ఆర్ డై

### సన్‌రైజర్స్ జోరుకు బ్రేక్ వేయగలదా?





ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్‌కు ఇక మిగిలిన ప్రతి మ్యాచ్ జీవన్మరణ పోరాటంగా మారింది. నేడు ముంబై వేదికగా ఫుల్ ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనున్న ముంబైకి ఈ మ్యాచ్ అత్యంత కీలకం. ఇప్పటికే ఏడు మ్యాచ్‌ల్లో ఐదు పరాజయాలతో పాయింట్ల పట్టికలో దిగువన ఉన్న ముంబై.. ప్లేఆఫ్ ఆశలను నిలబెట్టుకోవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సీజన్‌లో ముంబై ప్రదర్శన అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా నుంచి ఆశించిన స్థాయి నాయకత్వం కనిపించకపోగా, సూర్యకుమార్ యాదవ్ కూడా తన మార్క్ ఇన్నింగ్స్‌లతో జట్టును నిలబెట్టలేకపోయాడు. బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా ఉన్నప్పటికీ మొత్తం పేస్ దళం ప్రభావం చూపకపోవడం జట్టుకు ప్రధాన బలహీనతగా మారింది. చెన్నై చేతిలో ఎదురైన భారీ ఓటమి ముంబైపై ఒత్తిడిని మరింత పెంచింది. అయితే ముంబై ఇండియన్స్ చరిత్ర చూస్తే.. ఒత్తిడి పరిస్థితుల్లోనే అసలైన పోరాట స్ఫూర్తిని చూపిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ మాత్రం వరుస విజయాలతో సూపర్ ఫామ్‌లో ఉంది. అభిషేక్ శర్మ దూకుడు, ట్రావిస్ హెడ్ అగ్రెసివ్ బ్యాటింగ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ పేలవేగంతో ప్రత్యర్థులకు భారీ సవాల్‌గా మారుతున్నారు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ విభాగంలోనూ సమతూకం ఉండటం హైదరాబాద్‌కు అదనపు బలం. హెడ్ టు హెడ్ రికార్డుల్లో ముంబైకి స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, ప్రస్తుత ఫామ్ చూస్తే సన్‌రైజర్స్ మరింత ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఒకవైపు నిలబడాల్సిన ముంబై.. మరోవైపు జోరు కొనసాగించాలని చూస్తున్న హైదరాబాద్.. ఈ పోరు అభిమానులకు ఉత్కంఠభరిత మ్యాచ్‌గా మారనుంది. ఈ మ్యాచ్ ఫలితం రెండు జట్ల సీజన్ గమనాన్నే మార్చే అవకాశముంది.



## అభిషేక్ రన్‌రేట్ వెనుక రహస్యాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఐపీఎల్ 2026లో అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. వరుసగా భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూ ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్నాడు. తన విజయ రహస్యాన్ని వెల్లడించిన అభిషేక్, యువరాజ్ సింగ్ ఇచ్చిన మార్గదర్శకతే తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అని తెలిపాడు. లాక్‌డౌన్ సమయంలో యువరాజ్ వద్ద తీసుకున్న శిక్షణ తన ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చిందని చెప్పాడు. "ఐపీఎల్‌కే పరిమితం కాకుండా భారత్‌కు మ్యాచ్‌లు గెలిపించే స్థాయికి ఎదగాలి" అన్న యువరాజ్ మాటలు తనలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాయని పేర్కొన్నాడు. ఇక జట్టులో తన భాగస్వామి ట్రావిస్ హెడ్ ఇచ్చిన సూచనలు కూడా తన దూకుడైన బ్యాటింగ్‌కు కారణమయ్యాయని వెల్లడించాడు. బంతి అనుకూలంగా ఉంటే మొదటి బంతినుంచే దాడి చేయాలన్న హెడ్ సలహాను తాను పాటిస్తున్నానని చెప్పాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన అభిషేక్, ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలతో 380 పరుగులు సాధించాడు. అతని దూకుడు బ్యాటింగ్ సన్‌రైజర్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. అభిషేక్ తన తండ్రే తన మొదటి గురువని చెప్పాడు. చిన్నప్పటి నుంచి ఇంట్లోనే క్రికెట్ వాతావరణం ఉండటం, ప్రారంభ దశలోనే సరైన మార్గదర్శకత లభించడం తన ఎదుగుదలకు దోహదపడ్డాయని తెలిపాడు.

## వైభవ్‌ను ఆపడం కష్టం



**ముంబై, ఏప్రిల్ 29:** ఐపీఎల్ 2026లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌తో అదరగొడుతున్నాడు. అతడి బ్యాటింగ్‌పై టీమిండియా మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ కేవలం 16 బంతుల్లోనే 43 పరుగులు చేసి జట్టుకు దూకుడు ఆరంభం ఇచ్చాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే 400 పరుగులు చేసి లీడింగ్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. వైభవ్ ఆటతీరుపై స్పందించిన గావస్కర్, "అతడు ఆడుతున్న షాట్లు అద్భుతం. పది మంది ఫీల్డర్లను బౌండరీ వద్ద పెట్టినా అతడిని ఆపడం కష్టం. వయస్సే అతడి బలం. ప్రత్యర్థి ఎవరనేది పట్టించుకోకుండా నిర్భయంగా ఆడుతున్నాడు" అని వ్యాఖ్యానించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఇలాంటి ప్రదర్శన చేయడం అరుదైన విషయమని గావస్కర్ అభిప్రాయపడ్డారు. భయం లేకుండా ఆడే ధైర్యమే అతడిని ప్రత్యేకంగా నిలబెడుతోందని తెలిపారు. గత సీజన్‌లోనే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వైభవ్, తక్కువ మ్యాచ్‌ల్లోనే శతకం నమోదు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ జట్టుకు కీలకంగా మారాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో మంచి ప్రదర్శన చేస్తూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల కోసం పోటీపడుతోంది. వైభవ్ ఫామ్ కొనసాగితే జట్టుకు మరిన్ని విజయాలు ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## భారత్ బౌలర్లపై హసన్ నవాజ్ వివాదాస్పద వ్యాఖ్యలు

**లాహోర్, ఏప్రిల్ 29 :** పాకిస్థాన్ క్రికెటర్ హసన్ నవాజ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ సందర్భంగా ఓ స్థానిక ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన భారత్ బౌలర్లపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇంటర్వ్యూలో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ల గురించి మాట్లాడిన హసన్ నవాజ్, "టీమిండియాతో ఆడేటప్పుడు సహజంగానే అదనపు ప్రేరణ ఉంటుంది. వారి బౌలర్లపై దాడి చేయాలనే ఉత్సాహం కలుగుతుంది. నిజం చెప్పాలంటే వారి బౌలర్లందరినీ నేను ద్వేషిస్తాను" అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల నుంచి తీవ్ర ప్రతికూల స్పందన తెచ్చుకున్నాయి. అయితే తన వ్యాఖ్యలను వివరించేందుకు ప్రయత్నించిన హసన్ నవాజ్, మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరు మారుతుందని తెలిపాడు. "రన్‌రేట్ ఎక్కువగా ఉన్నప్పుడు బౌలర్ ఎవరో కాకుండా, జట్టుకు అవసరమైన పరుగులు చేయడంపైనే దృష్టి పెడతాం" అని చెప్పాడు. భారత్–పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లు ఎప్పటినుంచో అత్యంత ఉత్కంఠభరితంగా ఉంటాయి. 2013 తర్వాత ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగకపోయినా, ఐసీసీ టోర్నీల్లో తలపడే ప్రతి మ్యాచ్ ప్రపంచవ్యాప్తంగా భారీ ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు ఇరు దేశాల అభిమానుల మధ్య మరింత చర్చకు దారి తీస్తున్నాయి.

2025లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హసన్ నవాజ్, ఇప్పటివరకు టీ20ల్లో మంచి ప్రదర్శన కనబరిచాడు. కానీ తాజా వ్యాఖ్యలతో అతడు మైదానం బయట వివాదంలో చిక్కుకోవడం విశేషం.

## డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ–సిగరెట్?

### రియాన్ పరాగ్‌పై బీసీసీఐ సీరియస్



ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అనూహ్య వివాదంలో చిక్కుకున్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ–సిగరెట్ వాడుతున్నట్లు కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం పెద్ద చర్చకు దారి తీసింది. ఈ ఘటనపై బీసీసీఐ సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. వైరల్ వీడియో నేపథ్యంలో పరాగ్ నుంచి వివరణ కోరిన బీసీసీఐ, అతని సమాధానం ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. భారతదేశంలో ఈ–సిగరెట్లపై నిషేధం అమల్లో ఉన్న నేపథ్యంలో, ఈ ఘటన కేవలం ఐపీఎల్ క్రమశిక్షణ పరమైన అంశం మాత్రమే కాకుండా చట్టపరమైన కోణంలో కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో అమల్లోకి వచ్చిన ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం.. ఈ–సిగరెట్ల తయారీ, విక్రయం, నిల్వ, వినియోగం, ప్రచారం నిషేధితంగా పరిగణించబడుతుంది. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించే అవకాశముంది. దీంతో పరాగ్ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. ఐపీఎల్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. కొంతమంది ఆటగాళ్లు వ్యక్తిగతంగా ఈ–సిగరెట్లు వినియోగించినా, డ్రెస్సింగ్ రూమ్ వంటి ప్రదేశంలో కెమెరాల మధ్య అలాంటి చర్యలు అత్యంత నిర్లక్ష్యంగా భావిస్తున్నారు. ముఖ్యంగా జట్టు నాయకుడిగా ఉన్న పరాగ్ నుంచి మరింత బాధ్యతాయుత ప్రవర్తన ఆశిస్తారని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ ఘటనతో మరోసారి డ్రెస్సింగ్ రూమ్ గోప్యత అంశం కూడా చర్చకు వచ్చింది. సీజన్ ఆరంభానికి ముందు కెప్టెన్లు డ్రెస్సింగ్ రూమ్‌లలో కెమెరాల ఉనికి పై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ప్రసార వ్యవస్థపై నిర్ణయం బ్రాడ్‌కాస్టర్లదేనని బీసీసీఐ అప్పట్లో స్పష్టం చేసింది. ఇప్పుడు పరాగ్ ఘటనతో క్రమశిక్షణ, గోప్యత, చట్టబద్ధత అంశాలు ఒకేసారి చర్చనీయాంశంగా మారాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 30.04.2026
www.mudranews.in | @mudranews




**నీరు ఎక్కువగా తాగండి**

రోజంతా సరిపడినంత నీరు తాగాలి.
ఇది రక్తప్రసరణను సక్రమంగా ఉంచి గుండెకు సహాయపడుతుంది.



# ‘పెద్ది’లో మాస్ చార్ట్‌బస్టర్ రెడీ!



## రామ్ చరణ్ ఫ్యాన్స్ కి పండగే

**ముద్ర, సినిమా డెస్క్ :**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులను ఉత్సాహంలో ముంచెత్తే అప్‌డేట్ ఫిలిం నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘పెద్ది’ నుంచి భారీ స్పెషల్ సాంగ్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ పాట చిత్రీకరణ శరవేగంగా సాగుతుండగా, ఇది సాధారణ ఐటమ్ సాంగ్ కాదని, థియేటర్లలో మాస్ ఆడియన్స్‌ను ఊపేసే స్థాయి చార్ట్‌బస్టర్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ చిత్రానికి సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ స్పెషల్ ట్రాక్ కోసం ఆయన సిద్ధం చేసిన ట్యూన్ ఎనర్జీతో నిండిపోయిందని సమాచారం. ‘ఉప్పెన’తో సంగీతపరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు, ఈసారి చరణ్ ఇమేజ్‌కు తగ్గట్టుగా మరింత పవర్‌ఫుల్ మాస్ నెంబర్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో ఈ పాటను గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నారు. విజువల్‌గా అద్భుతంగా ఉండేలా ప్లాన్ చేసిన ఈ సాంగ్‌లో రామ్ చరణ్ స్టెప్స్ ప్రధాన హైలైట్ కానున్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ పాటలో దాచిన సర్‌ప్రైజ్ అంశం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. అది స్టార్ హీరోయిన్ ప్రత్యేక ప్రదర్శనా, లేక చరణ్ కొత్త లుక్కా అన్నది మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతోంది. శృతి హాసన్ భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ స్పెషల్ సాంగ్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో సంచలనం సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ‘పెద్ది’ నుంచి వస్తున్న ఈ అప్‌డేట్‌తో చరణ్ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.



# యశ్ ఫ్యాన్స్‌కు షాక్..
# ‘టాక్సిక్’ విడుదల వాయిదా

**ముద్ర, సినిమా డెస్క్ :**

రాకింగ్ స్టార్ యశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’ సినిమా విడుదలపై కీలక మార్పు చోటుచేసుకుంది. జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని యశ్ స్వయంగా భావోద్వేగపూరిత లేఖ ద్వారా అభిమానులతో పంచుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల సినిమాకాన్‌లో ‘టాక్సిక్’కు లభించిన అద్భుత స్పందనతో ఈ చిత్రంపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయని యశ్ వెల్లడించారు. ప్రపంచ మార్కెట్‌లో ఈ సినిమాకు ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, మరింత విస్తృత స్థాయిలో గ్లోబల్ రిలీజ్ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్ సంస్థలతో భాగస్వామ్యాలు పూర్తి చేసి, ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి భారీ విడుదలకు సరైన ప్రణాళిక సిద్ధం చేయడానికి అదనపు సమయం అవసరమవుతోందని యశ్ పేర్కొన్నారు. భారతీయ సినిమా గ్లోబల్ స్థాయిలో మరింత గౌరవం పొందేలా చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ఫైనల్ అవుట్‌పుట్‌పై పూర్తి నమ్మకం ఉందని యశ్ అభిమానులకు భరోసా ఇచ్చారు. కొన్ని గొప్ప కథలు ప్రేక్షకుల ముందుకు రావడానికి కాస్త సమయం తీసుకుంటాయని, ఆ నిరీక్షణకు తగిన స్థాయిలో సెలబ్రేట్ చేసుకునే సినిమా అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. దీంతో నిరాశ చెందిన అభిమానులు ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తున్నారు.

# మోహన్ లాల్ పై వెంకీ గ్రేటెస్ట్ స్టేట్ మెంట్

**ముద్ర, సినిమా డెస్క్ :**

భారతీయ సినీ చరిత్రలో సస్పెన్స్ థ్రిల్లర్‌లకు కొత్త ప్రమాణాలు సృష్టించిన చిత్రాల్లో ‘దృశ్యం’ ఒకటి. మలయాళంలో మోహన్‌లాల్ పోషించిన జార్జ్‌కుట్టి పాత్ర ఎంతటి ప్రశంసలు అందుకుందో, తెలుగులో అదే పాత్రను విక్టరీ వెంకటేష్ తనదైన శైలిలో ప్రేక్షకులకు చేరువ చేశారు. అయితే ఈ రీమేక్ సమయంలో వెంకటేష్ ప్రదర్శించిన వినయం, మరో స్టార్ నటుడి ప్రతిభపై చూపిన గౌరవం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ‘దృశ్యం’ రీమేక్ షూటింగ్ సమయంలో వెంకటేష్ చేసిన వ్యాఖ్యలను నటి ఎస్తేర్ అనిల్ తాజాగా గుర్తు చేశారు. మలయాళం, తెలుగు, హిందీ భాషల్లో కూతురు పాత్రలో నటించిన ఎస్తేర్ మాట్లాడుతూ.. మోహన్‌లాల్ ఇచ్చిన కొన్ని భావ వ్యక్తీకరణలను తాను తిరిగి చేయడం సాధ్యం కాదని వెంకటేష్ స్వయంగా చెప్పారని వెల్లడించారు. ఆ ఎక్స్‌ప్రెషన్స్ మోహన్‌లాల్‌కే ప్రత్యేకమని ఆయన అంగీకరించడం తనను ఎంతో ఆశ్చర్యపరిచిందని ఆమె పేర్కొన్నారు. ఒక స్టార్ హీరోగా ఉన్నప్పటికీ మరో నటుడి ప్రతిభను అంతటి నిజాయితీతో మెచ్చుకోవడం వెంకటేష్ వ్యక్తిత్వానికి నిదర్శనమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పాత్రను కేవలం అనుకరించకుండా, తనదైన శైలిలో మార్చుకుంటూనే అసలు భావోద్వేగాన్ని నిలబెట్టడం వెంకటేష్ ప్రత్యేకతగా నిలిచింది. తెలుగులో ‘దృశ్యం’, ‘దృశ్యం 2’ విజయవంతం కావడానికి అదే ప్రధాన కారణమని చెప్పొచ్చు. మోహన్‌లాల్ ఒరిజినల్ పాత్రకు గౌరవం ఇస్తూనే, తెలుగు నేటివిటీకి తగ్గట్టు పాత్రను మలచి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు వెంకటేష్. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, వెంకటేష్ సంస్కారం, ప్రొఫెషనలిజంపై మరోసారి ప్రశంసలు కురిపిస్తున్నాయి.

# నిద్రపోతున్నా తలుపుతట్టాడు..

## పంజాబీ ఇండస్ట్రీ చీకటి కోణాలపై సందీపా విర్క్ సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, సినిమా డెస్క్ :** పంజాబీ సినీ పరిశ్రమలో తనకు ఎదురైన చేదు అనుభవాలను నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సందీపా విర్క్ తాజాగా బహిర్గతం చేయడంతో ఇండస్ట్రీలో సంచలనం నెలకొంది. జైలు జీవితం అనంతరం ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె.. ఓ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సినిమా షూటింగ్ సమయంలో ఎదురైన అనుచిత పరిస్థితులపై ఆమె చెప్పిన వివరాలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఒక సినిమా షూటింగ్ కోసం అమృత్‌సర్‌లో ఉన్న సమయంలో రాత్రి వేళ తన గది తలుపు తట్టిన దర్శకుడు, స్నేహితుడనే నమ్మకాన్ని దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించాడని సందీపా వెల్లడించారు. అనుకోని ఆ పరిణామం తనను తీవ్ర అసౌకర్యానికి గురి చేసిందని, తనపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించాడని పేర్కొన్నారు. తాను రాజీ పడకపోవడంతో సినిమా నుంచి తొలగించారని ఆమె తెలిపారు. తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికే ఆ నిర్ణయం తీసుకున్నానని, వృత్తిపరంగా నష్టం జరిగినా వెనక్కి తగ్గలేదని సందీపా స్పష్టం చేశారు. అవకాశాల పేరుతో మహిళలపై ఒత్తిడి తేవడం పరిశ్రమలోని బాధాకర వాస్తవమని ఆమె వ్యాఖ్యానించారు. లు జీవితంపై కూడా సందీపా కీలక విషయాలు వెల్లడించారు. జైలు నిబంధనల పేరుతో మహిళలు ఎదుర్కొనే కొన్ని ప్రక్రియలు అవమానకరంగా అనిపించాయని, ఆ అనుభవాలు మానసికంగా తీవ్రంగా ప్రభావితం చేశాయని తెలిపారు. సందీపా విర్క్ చేసిన ఈ బహిరంగ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారాయి. సినీ రంగంలో మహిళల భద్రత, గౌరవం, పారదర్శకతపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేశాయి. ఆమె ధైర్యంగా మాట్లాడటాన్ని పలువురు అభినందిస్తుండగా, పరిశ్రమలోని చీకటి కోణాలపై వెలుగు పడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





# ఫరియా అబ్దుల్లా జీవితం వెనుక ఆసక్తికర కథ..

**ముద్ర, సినిమా డెస్క్ :**

టాలీవుడ్‌లో తన ఎత్తైన వ్యక్తిత్వం, ప్రత్యేక స్క్రీన్ ప్రెజెన్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా గురించి తాజాగా వెలుగులోకి వచ్చిన వ్యక్తిగత విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తెరపై తనదైన శైలిలో మెప్పించే ఫరియా, నిజ జీవితంలో మాత్రం భిన్నమైన కుటుంబ నేపథ్యంతో మరింత ఆసక్తికరంగా నిలుస్తోంది. ఫరియా కుటుంబంలో మతపరంగా చోటుచేసుకున్న మార్పులు ప్రత్యేకంగా నిలిచాయి. ఆమె తండ్రి హిందూ కుటుంబంలో జన్మించి తర్వాత ఇస్లాం మతాన్ని స్వీకరించగా, తల్లి ముస్లిం కుటుంబంలో పుట్టి అనంతరం హిందూ సంప్రదాయాన్ని అంగీకరించారు. ఇలాంటి విభిన్న సంస్కృతులు, భావజాలాల మధ్య పెరిగిన ఫరియా మతాలకన్నా మానవత్వం, కళలకే ఎక్కువ విలువ ఇస్తానని చెబుతోంది. ఇదే తన ఆలోచనా విధానాన్ని విశాలంగా మార్చిందని ఆమె భావిస్తోంది. అచ్చమైన హైదరాబాదీ అయిన ఫరియాకు నగర సంస్కృతి, జీవనశైలిపై ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నటనతో పాటు డాన్స్, పెయింటింగ్ వంటి కళారంగాల్లోనూ ఆమెకు మంచి పట్టు ఉంది. ఈ బహుముఖ ప్రతిభే తనను ప్రతి పాత్రలో కొత్త కోణంలో చూపించేందుకు సహాయపడుతోందని ఫరియా విశ్వసిస్తోంది. ఇప్పటివరకు ఫరియాను ఎక్కువగా వినోదాత్మక, క్విర్కీ పాత్రల్లో చూసిన ప్రేక్షకులు త్వరలో ఆమె కొత్త రూపాన్ని చూడబోతున్నారు. ‘గాయపడ్డ సింహం’ చిత్రంలో ఆమె పోషిస్తున్న ‘షాలిని’ పాత్ర తన కెరీర్‌లో ప్రత్యేక మలుపు అవుతుందని టాక్ వినిపిస్తోంది. ఈ పాత్రలో ఫరియా మరింత గంభీరంగా, భావోద్వేగాలకు దగ్గరగా కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. గ్లామర్ లేదా కామెడీకి పరిమితం కాకుండా తనలోని అసలైన నటనను చాటిచెప్పే అవకాశంగా ఈ సినిమాను ఫరియా భావిస్తోంది. దీంతో ఆమె కెరీర్‌లో ఇది కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం కనిపిస్తోంది.



# అనార్కలిలో మరింత అందంగా...

**ముద్ర, సినిమా డెస్క్ :** యువ నటి కయాదు లోహర్ తాజా ఫోటోషూట్‌లో అనార్కలి దుస్తుల్లో మరింత అందంగా మెరిసింది. ఎమరాల్డ్ గ్రీన్ షేడ్‌లో రూపొందిన సాంప్రదాయ వేషధారణ ఆమెకు ప్రత్యేక ఆకర్షణ తీసుకురాగా, బంగారు అంచుల డిజైన్ ఆమె లుక్‌ను మరింత రాయల్‌గా మార్చింది. ఈ క్లాసిక్ స్టైల్‌లో కయాదు కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. అందమైన జుమ్కాలు, స్టైలిష్ రింగ్, మెరిసే గాజులు ఆమె రూపానికి మరింత హైలైట్‌గా నిలిచాయి. తెల్లని పూలతో అలంకరించిన జడ కయాదు లుక్‌కు సంప్రదాయ హంగులను జోడించి, ఆమెను మరింత సొగసైన రూపంలో చూపించింది. సింపుల్ అండ్ ఎలిగెంట్‌గా కనిపిస్తూ తన స్టైల్‌తో మరోసారి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. సినిమా కెరీర్ పరంగా కూడా కయాదు లోహర్ వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. తమిళ చిత్రం ‘ఇధయం మురళి’లో అథర్వాతో కలిసి నటిస్తున్న ఆమె, మరిన్ని ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సంప్రదాయ లుక్స్‌లోనూ, ఆధునిక పాత్రల్లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటూ కయాదు సినీ ప్రపంచంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com